5న 'ఉల్లాస్' ప్రారంభం

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నవంబరు 5 నుంచి ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు వయోజన విద్య ఉప సంచాలకుడు ప్రభాకర్ తెలిపారు. జిల్లాలో 7,321 మందిని ఉల్లాస్‌లో చేర్పించాల్సి ఉండగా- ఇప్పటి వరకు 5,981 మంది మాత్రమే నమోదయ్యారన్నారు. మిగతా 1,340 మందిని త్వరలోనే నమోదు చేయించేందుకు చర్యలు చేపడుతున్నామని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి: ఎంపీ



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ కుమార్, చిత్రంలో ఎమ్మెల్యే చింతమనేని, కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి తదితరులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. దిశ కమిటీ ఛైర్మన్ హోదాలో ఎంపీ పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధి, సంక్షేమంతోపాటు అన్ని రంగాల్లోనూ జిల్లాను అగ్ర స్థానంలో నిలపాలన్నారు వ్యవసాయం, యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. స్వచ్ఛభారత్ మిషన్, జల్‌జీవన్ మిషన్ కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములు గుర్తించాలన్నారు. త్వరలో ఏలూరు, నూజివీడు రైల్వేస్టేషన్లను సందర్శిస్తామని ఆయన తెలిపారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు జోడించి జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణంపై ప్రభావం చూపుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన పథకం అమలుకు సంబంధించి నిరంతరం ఆడిట్ నిర్వహించాలని సూచించారు.

అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం.. బీఎస్ఎన్ఎల్, రైల్వే శాఖలకు సంబంధించి ఉన్నతాధికారులు గైర్హాజరవడంపై ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పునరావృతం కాకుండా చూడాలన్నారు. ట్రైకార్ ఛైర్మన్ బి.శ్రీనివాస్, జేసీ పి.ధాత్రిరెడ్డి, జడ్పీ సీఈవో సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు.. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో రూ.2 కోట్ల ఎంపీ నిధులతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు మహేశ్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఎంపీ, సీఎస్ఆర్ నిధులతో జిల్లాలో విద్యారోగ్య రంగాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో జిల్లా ప్రధాన ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఆధునిక వంటశాల, ఇతర ఆధునికీకరణ పనులకు రూ.13 కోట్ల సీఎస్ఆర్ నిధులను వెచ్చించనున్నట్లు తెలియజేశారు. దెందులూరులో పైలెట్ ప్రాజెక్టుగా చెత్తను శుద్ధి చేసే ప్లాంట్ పెట్టాలని యోచిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

రైల్వే ప్రయాణికులకు సహాయ కేంద్రం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: దానా తుపాను నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ డివిజన్‌లోని వివిధ రైల్వేస్టేషన్లలో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో 75693 05268, భీమవరంలో 78159 09402 నంబర్లతో సహాయ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని, రైల్వే ప్రయాణికులు వాటిని సంప్రదించాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

విత్తులోనే విపత్తు
నాణ్యత లేని రొయ్య సీడ్‌తో నష్టాలు
పోలీసుస్టేషన్ వద్ద యువతి ఆత్మహత్యాయత్నం
6లో

ఇంటి ముందుకే ఇసుక!

తరలింపులో ప్రభుత్వ సడలింపులతో రేవుల్లో వాహనాల సందడి



గుండేటి వాగులో ట్రాక్టర్లలోకి ఇసుక ఎగుమతి

కుక్కునూరు, న్యూస్‌టుడే: ఇసుక తరలింపులో ప్రభుత్వం ఇచ్చిన సడలింపులతో రేవుల్లో సందడి నెలకొంది. ప్రజలు తమ అవసరాల మేరకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా తరలించుకోవచ్చని చెప్పడంతో వాహనాలు బారులు తీరుతున్నాయి. గత ప్రభుత్వంలో రూ.5000 ఖర్చు పెడితే గానీ ట్రాక్టర్ ఇసుక ఇంటికి చేరేది కాదు. దీంతో సామాన్యులు చిన్నచిన్న నిర్మాణాలు చేయాలన్నా ఆలోచించాల్సి వచ్చేది. మరికొందరు వాయిదా వేసుకునేవారు. పోనీ ఎవరి కంటా పడకుండా తోలుకునే సాహసం చేస్తే ట్రాక్టరును సీజ్ చేయడంతో పాటు రూ.వేలు జరిమానా విధించేవారు. ఆ ఇబ్బందులన్నీ ఇప్పుడు లేవు.

పట్టపగలే.. ప్రసుత్తం పట్ట పగలే సామాన్యులు ఇసుక తీసుకెళుతున్నారు. కుక్కునూరు మండలంలోని గుండేటి వాగు, కిన్నెరసాని, పాములేరు, వేలేరుపాడు మండలంలోని పెద్దవాగు నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తున్నాయి. ఎగుమతి కూలీలకు రూ.500, ట్రాక్టరు కిరాయి రూ.1000(దూరాన్నిబట్టి)తో ఇంటి ముందుకే ఇసుక వస్తోంది. వాయిదా వేసుకుంటూ వస్తున్న నిర్మాణ పనులను సామాన్యులు సంతోషంగా ప్రారంభిస్తున్నారు.

ఎడ్లబండ్లకు తగ్గిన గిరాకీ.. మొన్నటి వరకు ట్రాక్టర్లకు అనుమతులు లేవు. ఎడ్ల బండ్లపై మాత్రమే తోలుకునే వెసులుబాటు ఉండేది. తాజాగా ట్రాక్టర్లకు కూడా అనుమతి ఇవ్వడంతో ఎడ్లబండ్లకు గిరాకీ తగ్గింది. మొత్తం మీద అయిదేళ్ల తర్వాత ఇసుక కష్టాలు తీరి, గతంలో మాదిరి సులువుగా ఇంటికి చేరుతుండటంతో సామాన్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పేదల కుటుంబాల్లో దీపావళి కాంతులు

ఏడాదికి ఉచితంగా 3 సిలిండర్లు

నేటి నుంచి నమోదుకు అవకాశం



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: పేదల కుటుంబాల్లో దీపావళి కాంతులు విరజిమ్మనున్నాయి. ఎన్డీఏ కూటమి ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ పథకాన్ని రానున్న దీపావళి రోజున ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. ఈ పథకం ద్వారా పేద కుటుంబాల వారికి ఏడాదిలో మూడు సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయనున్నారు. ఇందుకు అర్హులైన వారు ఈనెల 24 నుంచి బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు.

ప్రస్తుతం గ్యాస్ సిలిండరు ధర రూ.836 ఉంది. దూరాన్ని బట్టి రవాణా ఛార్జీలు అదనంగా ఉంటాయి. దీనిలో ప్రస్తుతం ప్రభుత్వం రూ.10.62 రాయితీగా తిరిగి ఖాతాల్లో జమ చేస్తోంది. ఇదిపోను రూ.826 లను లబ్ధిదారులు చెల్లిస్తున్నారు. ఇకపై ఎన్డీయే ప్రభుత్వం ఏడాదికి 3 సిలిండర్లను ఉచితంగా చెల్లించనుండటంతో ఒక్కో కుటుంబానికి సగటున రూ.2,475 మేర ఆదా కానుంది. గ్యాస్ సిలిండర్‌ను బుక్ చేసుకున్న వారు ముందుగా సొమ్మును చెల్లించిన తర్వాత వారి వ్యక్తిగత ఖాతాల్లో ప్రభుత్వం నగదు బదిలీ విధానం ద్వారా తిరిగి సొమ్ము జమ చేస్తుంది.

అర్హులు ఎవరంటే.. ● ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారు. ● వార్షికాదాయం గ్రామాల్లో.. రూ.2 లక్షలకు, పట్టణాల్లో రూ.3 లక్షలకు మించని వారు. ● బియ్యం కార్డు కలిగి ఉండాలి. ● అర్హులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

రేషన్ కార్డులు	6,31,044
గ్యాస్ కనెక్షన్లు	6.40 లక్షలు
జిల్లాలో రేషన్ కార్డుదారులకు లబ్ధి	రూ.155.92 కోట్లు

విధివిధానాలు వెలువడాల్సి ఉంది.. ప్రభుత్వం ప్రకటించిన ప్రాథమిక ఆదేశాల ప్రకారం లబ్ధిదారులు ఈనెల 24 నుంచి దరఖాస్తు చేసుకోచ్చని జిల్లా పౌరసరఫరాల అధికారి సత్యనారాయణ రాజు తెలిపారు. ఏ కేటగిరీ వారికి ఏవిధంగా ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయిలో మార్గదర్శకాలు జారీ కావాల్సి ఉందని అన్నారు.

భక్త హనుమంత.. తనువు పులకింత

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు




లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న అర్చకులు



హనుమత్ వాహన సేవ

ఆత్రేయపురం, న్యూస్‌టుడే: వేంకటాద్రిరాయుడు హనుమంత వాహనంపై ఊరేగారు. త్రేతాయగం నాటి శ్రీరాముడిని తానేనంటూ భక్తులకు దర్శనమిచ్చారు. కోనసీమ తిరుమల వాడపల్లి వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు బుధవారం అనన్య భక్తుడైన హనుమంతు వాహన సేవలో స్వామివారు కోదండ రామ అలంకరణలో భక్తులను కటాక్షించారు. కృతయుగంలో నృసింహస్వామిగా, త్రేతాయుగంలో శ్రీరాముడిగా, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా, కలియుగంలో వేంకటేశ్వరుడిగా స్వామి అవతరించారన్న సందేశాన్ని చాటుతూ వాడపల్లి తిరువీధుల్లో హనుమంత వాహనసేవ.. రామ రాజ్య వైభవాన్ని సాక్షాత్కరింపజేసింది. పండితుడు ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు నేతృత్వంలో ఉదయం అష్టోత్తర శతకలశాభిషేకం, లక్ష తులసి పూజ, నవగ్రహ హోమం జరిగాయి.

దీవెన లేదు.. వంచన



- విద్యార్థులను అన్యాయం చేసిన వైకాపా సర్కారు
- ఫీజులు చెల్లించాలంటూ యాజమాన్యాల ఒత్తిళ్లు
- ఉభయ జిల్లాల్లో రూ.168 కోట్ల బకాయిలు

● గణపవరానికి చెందిన ఓ విద్యార్థి ఏలూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. రెండో ఏడాది నాలుగు విడత, మూడో ఏడాదిలో అసలు విద్యా దీవెన సొమ్ము జమకాలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ గణితం చేరేందుకు మార్కుల పత్రాలు అవసరం కాగా కళాశాలకు వెళితే రూ.62 వేలు ఫీజు కట్టాలని చెప్పారు. సొమ్ము లేక ప్రైవేటు ఉద్యోగంలో చేరారు.

● భీమవరానికి చెందిన ఓ విద్యార్థిని పట్టణంలోని ఓ కళాశాలలో బీటెక్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లో ఎంటెక్ చేరాలంటే.. కౌన్సెలింగ్‌లో మార్కుల పత్రాలు అవసరం. కళాశాలకు వెళితే.. ఫీజు బకాయిలు రూ.78వేలు ఉన్నాయి. మరో దారి లేక అప్పు చేసి ఫీజు చెల్లించారు. నెలకు దాదాపు రూ.2వేల వరకు వడ్డీ చెల్లిస్తున్నారు.

● ఏలూరు శ్రీరామ్‌నగర్‌కు చెందిన కోమలి నగరంలోని ఓ కళాశాలలో ఇంజినీరింగ్ చదివారు. ఎంఎస్ చేసేందుకు హైదరాబాద్ వెళ్లగా మార్కుల పత్రాలు అడిగారు. రూ.1.3 లక్షల ఫీజు అప్పు చేసి కళాశాలలో చెల్లించి పత్రాలు తీసుకువెళ్లారు.

జిల్లా	ఏలూరు	పశ్చిమ
జమ కావాల్సిన మొత్తం(రూ.కోట్లలో)	59	109
విద్యార్థుల సంఖ్య	32,990	45,789

ఈనాడు, ఏలూరు

వైకాపా సర్కారు విద్యార్థులకు అన్యాయం చేసింది. గతేడాది విద్యాదీవెన బకాయిలు చెల్లించకుండా ఎగనామం పెట్టింది. విద్యా సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడిచినా తల్లుల ఖాతాల్లో సొమ్ములు జమ కాలేదు. దీంతో కళాశాల యాజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే మార్కుల పత్రాలు ఇస్తామని తెగేసి చెబుతున్నాయి. దీంతో ఉన్నత చదవులకు, ఉద్యోగ నియామకాలకు వెళ్లే విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

వైకాపా సర్కారు కళాశాలలో చదివే పేద విద్యార్థులకు ఏడాదికి రూ.50 వేలు ఇచ్చేలా పథకాన్ని రూపొందించారు. నాలుగు విడతలుగా జమ చేసేలా నిర్ణయం తీసుకున్నారు. పథకం ప్రారంభం నుంచి నగదు జమ విధానం సవ్యంగా లేదు. ఏడాదిలో నాలుగు విడతల్లో ఏదో ఒక సారైనా కొర్రీలు సహజమే. ఉభయ జిల్లాలో 2020-21 విద్యా సంవత్సరంలో మొదటి విడత జమకాని వారు వేలల్లో ఉన్నారు. 2022-23లో చాలా మందికి పడలేదు. 2023-24లో అసలు నిధులు విడుదల చేయలేదు. రెండు జిల్లాలో 78,776 మందికి రూ.168 కోట్ల బకాయిలు ఉన్నాయి.

మార్కుల పత్రాలకు ఒత్తిడి.. ఈ ఏడాది వేలాది మంది విద్యార్థులు కళాశాల నుంచి బయటి వచ్చారు. పీజీ.. ఎంటెక్, ఎంఎస్ చేసేందుకు వెళ్లాలంటే మార్కుల పత్రాలు తప్పనిసరి. దీంతో కళాశాలల యజమాన్యాలు ఫీజు చెల్లిస్తేనే మార్కుల పత్రాలు ఇస్తామని చేతులెత్తేశారు. ఒక్కో విద్యార్థి రూ.లక్ష నుంచి రూ.1.5 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. దీంతో పేద మధ్య తరగతి విద్యార్థులకు నగదు చెల్లించలేక.. ఉన్నత చదువులకు వెళ్లలేక నలిగిపోతున్నారు. కొందరు అప్పులు తెచ్చి మార్కుల పత్రాలు తెచ్చుకుంటున్నారు.

కూటమిపై కోటి ఆశలు.. బకాయిలు చెల్లిస్తామని తాజాగా మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చినా నగదు జమ కాలేదు. విద్యార్థులను ఒత్తిడి చేయకుండా మార్కుల పత్రాలు ఇవ్వాలని, ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తుందని యాజమాన్యాలకు ప్రభుత్వం చెప్పాలని విద్యార్థులు వాపోతున్నారు. కొద్ది రోజుల్లో జరగనున్న మంత్రివర్గ సమావేశాల్లో దీనిపై కీలక నిర్ణయం తీసుకుంటారని త్వరలో నిధులు జమవుతాయని ఏలూరు, పశ్చిమ జిల్లాల సాంఘిక సంక్షేమశాఖ అధికారులు జయప్రకాశ్, శోభారాణి తెలిపారు

పుణ్య క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: కార్తిక మాసం సందర్భంగా పుణ్య క్షేత్రాల సందర్శనకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ డీపీటీవో వరప్రసాద్ తెలిపారు. ఏలూరులో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి, తొలుత గోడపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... కార్తిక మాసంలో పంచారామ క్షేత్రాలు అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటకు ప్రతి ఆదివారం రాత్రి ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి బస్సులు బయల్దేరి సోమవారం రాత్రికి తిరిగి ఆయా డిపోలకు చేరుతాయన్నారు. వచ్చే నెల 3, 10, 17, 24 తేదీల్లో పంచారామ క్షేత్రాలకు బస్సులు తిప్పనున్నట్లు చెప్పారు. శబరిమల యాత్రకు వెళ్లేందుకు అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. డిపో మేనేజరు బి.వాణి తదితరులున్నారు.

ఉద్యోగ భర్తీ ప్రకటన రద్దు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని వివిధ న్యాయస్థానాల్లో స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ ఉద్యోగాల భర్తీకి జారీ ప్రకటనను రద్దు చేసినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తం కుమార్ తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులు అనుసరించి రద్దు చేశామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వెలిగించాలంటే రూ.6.50 కోట్లు అవసరం

వీధి దీపాల నిర్వహణ గాలికి!

అంధకారంలో పట్టణాలు



ఏలూరు పాతబస్టాండ్ రోడ్డులో వెలగని విద్యుద్దీపం


భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని పలు పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణను వైకాపా పట్టించుకోలేదు. గతంలో తెదేపా హయాంలో పట్టణాల్లోని వీధి దీపాల నిర్వహణ బాధ్యతలను ఈఈఎస్ఎల్‌కు అప్పగించింది. ఒప్పందం మేరకు బకాయిలు లేకుండా బిల్లులు చెల్లించడంతో నిర్వహణ సజావుగా సాగింది. వైకాపా అధికారంలోకి వచ్చాక బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఆ సంస్థకు నిర్వహణ భారమైంది. ఒప్పందం కూడా దాదాపు ఏడాది కిందటే చాలా పట్టణాల్లో ముగిసింది. అక్కడ నిర్వహణ బాధ్యతలను పట్టణాలు స్వీకరించడం మూలిగే నక్కపై తాటిపండు పడినట్టయింది. పట్టణాల్లో వీధి దీపాల నిర్వహణ పూర్తిస్థాయిలో ఉండాలని పట్టణాధికారులకు సూచించినట్లు పురపాలక రాజమహేంద్రవరం ప్రాంతీయ సంచాలకుడు నాగ నరసింహారావు చెప్పారు. బల్బులు, సామగ్రికి సాధారణ నిధులు కేటాయించి కొత్తవి బిగించడంతో పాటు పాత వాటికి మరమ్మతులు చేస్తున్నారన్నారు.

రూ.8 కోట్ల బకాయిలు.. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గతంలో బాధ్యతలు నిర్వహించిన ఈఈఎస్ఎల్‌కు దాదాపు రూ.8 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఒప్పందం పూర్తయినా బకాయిలను గత ప్రభుత్వం చెల్లించలేదు. ఏడాది కిందట చాలాచోట్ల బాధ్యతలు ఆయా పురపాలక సంఘాలు చేపట్టాయి. వీధి దీపం, సామగ్రి కొనుగోలు చేసే శక్తి లేకపోవడంతో మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాలకు దాదాపు 3,430 వీధి దీపాలు వెలగడం లేదు. అన్నిచోట్లా వెలుగులు విరజిమ్మాలంటే రూ.6.50 కోట్లు భారం పడుతుందనేది అంచనా.

చీకట్లో అవస్థలు.. ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్)తో ఒప్పందం ఉన్నంతకాలం ఎల్ఈడీ దీపాలతో పాటు వాటి పరికరాలను సంబంధిత సంస్థ సమకూర్చుకుంది. ప్రధాన కూడళ్లలో 110 వాట్స్, అంతర్గత వీధుల్లో 60 వాట్స్, 20 వాట్స్ గల దీపాలను ఏర్పాటు చేశారు. బల్బు మరమ్మతులకు గురైతే 48 గంటల వ్యవధిలోనే కొత్తది ఏర్పాటు చేసేవారు. ఏలూరు, భీమవరం, నరసాపురం, జంగారెడ్డిగూడెం పాలకొల్లు పట్టణాల్లోని దాదాపు 14,500 వీధి దీపాల బాధ్యత ఆ సంస్థపై ఉండేది. ప్రధాన వీధుల నుంచి శివారు ప్రాంతాల వరకు వెలుగులుండేవి. ఆ సంస్థ బాధ్యతలు పూర్తయిన తర్వాత పట్టణాల్లో అంధకారం నెలకొంది. ప్రయాణికులు గుంతల దారుల్లో పడి గాయపడటం, చీకట్లో వెళ్లేవారి మెడలోని బంగారు ఆభరణాలు లాక్కెళ్లడం వంటి సంఘటనలు అధికమయ్యాయి.

పొలాల్లోనే చిరుత

తాజాగా మరిన్ని ప్రాంతాల్లో కాలి గుర్తులు



ఎం.నాగులపల్లి వద్ద నిఘా కెమెరా అమర్చుతున్న అటవీశాఖ సిబ్బంది

భీమడోలు, ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: భీమడోలు శివారు, ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి పరిసర ప్రాంతాల్లో సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న చిరుతను బంధించేందుకు అధికారులు చేస్తున్న ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. తాజాగా ద్వారకానగర్ శివారు వీరాంజనేయ దాబా ఎదుటనున్న వ్యవసాయ క్షేత్రంలో బుధవారం చిరుత కాలిగుర్తులు కనిపించాయి. మంగళవారం అంబరుపేట పంచాయతీ వసంతకాలనీ ప్రాంతంలో తిరిగినట్లు భావించగా- ప్రస్తుతం వెనక్కి వచ్చి ఇక్కడి వ్యవసాయ పొలాల్లో ఉండొచ్చని అటవీ శాఖాధికారులు భావిస్తున్నారు. డిప్యూటీ డీఎఫ్‌వో శ్రీదేవి, రేంజర్ దావీదురాజు నాయుడు, కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది చిరుత కదలికలపై నిఘా పెంచేందుకు వివిధ ప్రదేశాల్లో 15 అత్యాధునిక నిఘా కెమెరాలు ఏర్పాటు చేశారు. కొత్తగా మరో మూడు బోనులు పొదల మాటున పెట్టారు. చిరుత తిరుగుతోందని భావిస్తున్న వ్యవసాయ క్షేత్రాల్లో రాత్రివేళ సిబ్బంది ప్రత్యక్ష నిఘాకు మంచెను(మచాన్) నిర్మించారు. రేంజర్ దావీజురాజు నాయుడు మాట్లాడుతూ... వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిరుత కదలికలను గమనిస్తున్నామని, దాన్ని పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలకు ముకుతాడు!

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే

సాంకేతికత.. సామాజిక మాధ్యమాల విస్తృతి నేపథ్యంలో కొన్నాళ్లుగా సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతూ అమాయకుల వద్ద పెద్ద మొత్తంలో నగదు దండుకుంటున్నారు. దీంతో ఈ నేరాలను అరికట్టేందుకు ఎన్డీయే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాకో సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు డీజీపీ తిరుమలరావు గతంలో ప్రకటించారు. సైబర్ స్టేషన్ ఏర్పాటుతో సైబర్ బాధితులకు సాంత్వన చేకూరనుంది.

ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సైబర్ సెల్ కేంద్రాలున్నాయి. ఇక్కడ బాధితుల వివరాలు నమోదు చేసుకుని రాష్ట్రస్థాయిలో సైబర్ పోలీసుస్టేషన్‌కు కేసులు అనుసంధానం చేస్తున్నారు. దర్యాప్తు, వాటి పురోగతి, సొత్తు రికవరీ, నేరస్థులను పట్టుకోవడం, వారి కదలికలు పసిగట్టడం తదితరాలన్నీ రాష్ట్ర స్థాయిలోనే జరుగుతాయి. ఫలితంగా ఇక్కడ వాటన్నింటినీ పరిష్కరించేందుకు వీలుండటం లేదు. కేసుల ఛేదన ఆలస్యమవుతుండటంతో.. నేరస్థులు తప్పించుకుంటున్నారు.



కేసుల నమోదులో జాప్యం.. సైబర్ నేరాలకు సంబంధించి ఆయా పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేయడం ఆలస్యమవుతోంది. ఇటీవల నూజివీడు పట్టణానికి ఓ వ్యక్తి బ్యాంకు ఖాతాలోని రూ.3.05 లక్షలను సైబర్ నేరగాళ్లు అపహరించారు. బాధితుడు నూజివీడు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసేందుకు వెళితే వారు.. పది రోజులపాటు తప్పించుకున్నారు. చివరకు గట్టిగా ప్రశ్నించడంతో కేసు నమోదు చేయక తప్పలేదు. ఇప్పటికీ బాధితుడికి న్యాయం జరగలేదు.

జిల్లాకో పోలీసుస్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం

ఇకపై కేసుల నమోదు, దర్యాప్తు వేగవంతం

ఇకపై జిల్లా స్థాయిలోనే.. జిల్లాకో సైబర్ పోలీసు స్టేషన్ రానుండటంతో.. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి వరకు సైబర్ నేరం జరిగితే ఆయా శాంతిభద్రతల పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నారు. జిల్లా స్థాయిలోనే పోలీసుస్టేషన్ ప్రత్యేకంగా ఏర్పాటైతే కేసుల నమోదు, దర్యాప్తు ఇక్కడే జరగనున్నాయి. దీంతోపాటు ఓ డీఎస్పీ స్థాయి అధికారిని నియమించి సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పూర్తి స్థాయిగా అందుబాటులో ఉంటారు. అవసరమైన సాంకేతిక వ్యవస్థ స్టేషన్‌లో ఉంటుంది. సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్న సిబ్బందిని నియమిస్తారు. తద్వారా దర్యాప్తు వేగవంతం కానుంది.

నాలుగేళ్లలో సైబర్ నేరాలిలా..

2021	2022	2023	2024
28	31	41	43


సత్వర న్యాయం.. 'జిల్లాకో సైబర్ పోలీసుస్టేషన్ ఏర్పాటైతే కేసుల దర్యాప్తు వేగవంతానికి వీలవుతుంది. బాధితులకు సత్వర న్యాయం జరుగుతుంది' అని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ తెలిపారు.

అలా.. పట్టుకుపోతే ఎలాగండీ?

సీఎండీకి అధికారుల ఫిర్యాదు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: భీమవరంలో నూతనంగా విద్యుత్తు ఎస్ఈ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లా మొత్తానికి ఏలూరు సర్కిల్ నుంచే కార్యకలాపాలు సాగేవి. ప్రస్తుతం భీమవరం కేంద్రంగా ప్రారంభించారు. పశ్చిమ గోదావరి జిల్లాకు ప్రత్యేకంగా విద్యుత్తు విభాగం ఏర్పాటు చేశారు. ఇక్కడ గతంలో సబ్‌డివిజన్ విద్యుత్తు కార్యాలయం నిర్వహించిన భవనాన్ని ఎస్ఈ కార్యాలయానికి కేటాయించారు. ఎస్ఈ, ఈఈ ఛాంబర్లతోపాటు వివిధ విభాగాలకు చెందిన పలువురు డీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పనిచేయాల్సి ఉంది. మొన్నటివరకు ఏలూరులో ఏడీఈగా పని చేసిన ఓ అధికారి బదిలీల్లో భాగంగా భీమవరం వెళ్తూవెళ్తూ తన ఛాంబరులోని ఏసీని, మరో గదిలోని ఇంకో ఏసీ పట్టుకెళ్లిపోయారు. కుర్చీలు, టేబుళ్లు సైతం వెంట తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఇక్కడి అధికారులు ఈపీడీసీఎల్ సీఎండీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

సచివాలయ నిర్మాణానికి విరాళం



చంద్రబాబునాయుడికి విరాళం అందిస్తున్న వైష్ణవి, మనోజ్

ముదినేపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్ర సచివాలయ నిర్మాణానికి ముదినేపల్లికి చెందిన అమరావతి అంబాసిడర్ అంబుల వైష్ణవి అర ఎకరం పొలాన్ని అమ్మి విరాళంగా అందించారు. మంగళవారం రాత్రి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆమె తండ్రి వైద్యుడు మనోజ్‌తో కలిసి డబ్బు అందించారు. అర ఎకరానికి సంబంధించిన రూ.12.5 లక్షలు, హైకోర్టు నిర్మాణానికి బంగారపు గొలుసు అమ్మి రూ.లక్ష విరాళం ఇచ్చారు. గతంలో అమరావతి అభివృద్ధికి ఆమె ఎకరం(రూ.25 లక్షలు), పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కూడా విరాళం అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



త్రోబాల్ బాలికల జట్టుతో అలివేలు మంగ, పీఈటీలు

ఏలూరు తూర్పు వీధి, న్యూస్‌టుడే: స్థానిక ఇండోర్ మైదానంలో పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యాన త్రోబాల్, కబడ్డీ అండర్-14, 17 విభాగాల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయి బాలబాలికల ఎంపిక పోటీలు బుధవారం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల నుంచి కబడ్డీకి 760, త్రోబాల్‌కు 370 మంది చొప్పున క్రీడాకారులు హాజరయ్యారు. రెండు క్రీడలకూ చెరో 12 మంది చొప్పున ఎంపిక చేశారు. అండర్-17 బాలబాలికల కబడ్డీ జట్లు ఈ నెల 25న విజయనగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 విభాగాల కార్యనిర్వహణాధికారి కె.అలివేలు మంగ తెలిపారు. వివిధ పాఠశాలల పీఈటీలు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి బాలబాలికల స్కేటింగ్ ఎంపికలు



ఎంపికైన బాలబాలికల జట్టుతో రమేశ్, శిక్షకులు

ఏలూరు తూర్పు వీధి, న్యూస్‌టుడే: స్థానిక కలపర్రు బైపాస్ రోడ్డులోని రామచంద్ర కళాశాల సమీపంలో బుధవారం రోడ్ రోలర్ స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 95 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో క్వాడ్ లైన్ 25, ఇన్‌లైన్ స్కేటింగ్ 25 మంది చొప్పున ఎంపిక చేశారు. వీరిని జిల్లా ముఖ్య శిక్షకుడు బి.శ్రీనివాసరావు, స్కేటింగ్ సంఘం జిల్లా కార్యదర్శి కె.రమేష్ అభినందించారు. కాకినాడలో నవంబరు 6 నుంచి 10 తేదీ వరకు ఆర్‌ఎస్‌ఎఫ్ఐ, ఏపీఆర్ఎస్ఏ 36వ రాష్ట్ర స్థాయి రోలర్ పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు. జిల్లా సంఘ కార్యదర్శి డి.సురేష్, రాష్ట్ర పరిశీలకుడు రమ, డీఎస్ఏ శిక్షకుడు ఎస్‌కే.ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 26 నుంచి తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.వీరాంజనేయులు తెలిపారు. ఏలూరు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదుకు తెదేపా కేంద్ర కార్యాలయం నుంచి 12 మంది సభ్యులు వస్తారని, వీరిలో ఇద్దరిని బృందాలుగా ఏర్పాటు చేసి 26, 27, 28, 29 తేదీల్లో గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. సభ్యత్వ నమోదు ప్రక్రియలో తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని విజయవంతం చేయాలని బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

అక్క అత్తింటివారు తిట్టారని
యువతి ఆత్మహత్యాయత్నం
ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ వద్ద ఘటన

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అక్క అత్తింటివారు తిట్టారన్న మనస్తాపంతో ఓ యువతి ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ వద్దఉన్న మరుగుదొడ్డిలో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. వట్లూరు శౌరీపురానికి చెందిన చొదిమెళ్ల శైలజకు పెదవేగి మండలం కవ్వగుంటకు చెందిన రమేశ్‌తో 2017లో వివాహమైంది. నెల రోజుల క్రితం దంపతుల మధ్య గొడవ చోటుచేసుకుంది. భార్య పిల్లలను తీసుకుని శౌరీపురంలోని పుట్టింటికి చేరారు. శైలజ చెల్లి స్వరూప మహిళా పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని, బావను మందలించి కాపురం సజావుగా జరిగేలా కౌన్సెలింగ్ ఇస్తారని ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో బుధవారం ఏలూరు మహిళా పోలీసుస్టేషన్‌కు చేరుకొని అక్కతో ఫిర్యాదు ఇప్పించారు. దీంతో పోలీసులు శైలజ భర్త, అతని కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించారు. సమస్యను పెద్దల సమక్షంలో పరిష్కరించుకుంటామని, కొంత సమయం ఇవ్వాలని కోరడంతో పోలీసులు వారిని పంపేశారు. స్టేషన్ బయట స్వరూపను బావ రమేశ్, అతని కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన యువతి స్టేషన్ ప్రాంగణంలోని మరుగుదొడ్డిలోకి వెళ్లి చున్నీతో ఉరి బిగించుకోగా..గమనించిన పోలీసులు ఆమెను కిందకు దించి తమ వాహనంలోనే సర్వజన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవల నిమిత్తం విజయవాడ తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఓ కార్మికుడు మృతి చెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. లంబాడీకాలనీకి చెందిన బూక్యా రాఘవ(30) తాపీ పనులు చేస్తుంటారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. రోజువారీగా ఏలూరు సత్యనారాయణపేటలోని ఓ ఇంటి నిర్మాణ పనులకు వెళ్లారు. అక్కడ పని చేస్తుండగా- విద్యుత్తు తీగ తగిలి తీవ్రంగా గాయపడ్డారు. ఆయన్ను సహచర కార్మికులు సర్వజన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు ప్రశాంతం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు బుధవారం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు డివిజనల్ కో-ఆపరేటివ్ అధికారి త్రినాథ్ ఫలితాలు వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో 264 మంది ఓటర్లుండగా- 224 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్షురాలిగా దండుబోయిన అనూష, ఉపాధ్యక్షురాలిగా మొగపర్తి దయావతమ్మ, కార్యదర్శిగా మార్లపూడి లీలారాణి, కోశాధికారిగా తరగటూరి సామ్రాజ్యం, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా నల్లమెల్లి బేబీ ఉమా, రాయల కన్యాకుమారి, దాసి మాధవి ఎన్నికయ్యారు. ఎన్నికల ఫలితాలు వెల్లడించే సమయంలో కాస్త హడావుడి నెలకొంది. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కొవ్వాడ భయం.. ప్రభుత్వ అభయం!
నిర్వహణ, మరమ్మతులకు నిధులు మంజూరు



కొవ్వాడ కాలువ గట్టుకు తాత్కాలికంగా తడికలు, ఇసుక బస్తాల ఏర్పాటు(పాత చిత్రం)

పోలవరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో కోతకు గురైన కాలువ గట్లు, జలాశయాల నిర్వహణకు ఒక్క రూపాయి విడుదల చేయకపోవడంతో వాటి పరిస్థితి ప్రస్తుతం దయనీయంగా మారింది. షట్టర్లు పైకి లేపడానికి, వైర్లకు గ్రీజు రాయడానికి అధికారులే ఏటా జేబులో సొమ్ము ఖర్చు చేయాల్సిన దుస్థితి నెలకొంది.

కొండ వాగులు విరుచుకుపడటంతో 2021లో పట్టిసీమ పరిధిలో కొవ్వాడ కాలువ గట్టు పలు చోట్ల కోతకు గురయ్యాయి. అప్పట్లో తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టారు. అప్పట్లో ఆయా ప్రదేశాల్లో పాతిన కర్రలు, పెట్టిన తడికలు వాటి వెనుక వేసిన ఇసుక బస్తాలు కాలువ గర్భంలో కలిసిపోయాయి. కొవ్వాడ కాలువపై అవుట్‌ఫాల్ స్లూయిజ్ నిర్మించడం, గోదావరికి వరద పెద్దగా లేనప్పుడు వాగుల నీరు వచ్చింది వచ్చినట్లు గోదావరిలోకి పారడంతో కొన్నేళ్లుగా స్థానికులతో పాటు రైతులూ ఊపిరి పీల్చుకుంటున్నారు. లేదంటే ఎక్కడ గండి పడినా పోలవరం, తాళ్లపూడి, కొవ్వూరు, చాగల్లు, నిడదవోలు, తాడేపల్లిగూడెం మండలాల పరిధిలో వేలాది ఎకరాలు ముంపునకు గురయ్యేవని కర్షకులు చెబుతున్నారు.

ఏటా బిక్కు బిక్కుమంటూ

కొండ వాగులు విరుచుకుపడినప్పుడల్లా బలహీనంగా ఉన్న గట్ల పరిస్థితిని చూసి రైతులు ఎక్కడ ఉపద్రవం ముంచుకొస్తుందోనని భయంతో గడుపుతుంటారు. రెండేళ్ల కిందట తెల్లవారుజామున పేద్రాల, నక్కాల వాగులు ఉద్ధృతంగా ప్రవహించాయి. ఆ సమయంలో పట్టిసీమ అవుట్‌ఫాల్‌స్లూయిజ్ షట్టర్లు పైకిలేపడం ఆలస్యం కావడంతో గ్రామస్థులు భయాందోళన చెందారు. ఈలోగా పొలాల వైపు గండి పడటం, స్లూయిజ్ షట్టర్లు పైకి లేవడంతో అప్పట్లో పెద్ద ఉపద్రవం తప్పింది.

అస్తవ్యస్తంగా షట్టర్లు



పట్టిసీమ వద్ద ఎగుడుదిగుడుగా అవుట్‌ఫాల్‌స్లూయిజ్ తలుపులు

అవుట్‌ఫాల్‌స్లూయిజ్ షట్టర్లు ఎగుడు దిగుడుగా ఉన్నాయి. ఈ కారణంగా నీరంతా ఒక వైపు నుంచే ప్రవహించడంతో యాప్రాన్, దానికి ఆనుకుని ఉన్న గట్టు దెబ్బతింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ముందు జాగ్రత్తగా వాగుల నీరంతా గోదావరిలోకి వెళ్లేలా పది మీటర్ల వరకు షట్టర్లు పైకి లేపి ఉంచారు. 'కొవ్వాడ జలాశయం, అవుట్‌ఫాల్ స్లూయిజ్ మరమ్మతులు, కాలువ గట్ల పటిష్ఠానికి ప్రభుత్వం రూ.2.58 కోట్లు మంజూరు చేసింది'అని జలాశయ పర్యవేక్షణ ఏఈ రాహుల్ తెలిపారు.



15 కిలోల సీతల్ చేప

కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి మండల కేంద్రంలోని నల్లగొపుల చలపతికి చెందిన చేపల చెరువులో బుధవారం భారీ సీతల్ రకానికి చెందిన చేప లభ్యమైంది. సాధారణంగా 10 కిలోల వరకు పెరిగే ఈ రకం చేప అరుదుగా 15 కిలోల చేప కనిపించడంతో చూసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు ఎగబడ్డారు. రోహూ, కట్లా జాతికి చెందిన చెరువుల్లో చైనా గొరకను నివారించేందుకు ఈ సీతల్ రకానికి చెందిన చేపలను చెరువుల్లో తక్కువ స్థాయిలో పెంచుతారు. 8 నెలల వ్యవధిలో 15 కిలోల వరకు పెరిగిందని రైతు తెలిపారు.

అంతర్జాతీయ స్థాయికి జంగారెడ్డిగూడెం యువకుడి ప్రతిభ
సింగపూర్‌లో నిర్వహించే ఈత పోటీలకు అర్హత



గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ నుంచి ఛాంపియన్‌షిప్ ట్రోఫీ అందుకుంటున్న రవికార్తీక్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన స్విమ్మర్ బుడిగన రవి కార్తిక్ అంతర్జాతీయ పారా ఈత ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాడు. ఈ నెల 19 నుంచి 22 వరకు గోవాలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో జూనియర్స్ కేటగిరి అండర్-18 విభాగంలో రవి కార్తిక్ 110 మీటర్ల ఫ్రీస్టైల్, 100 మీటర్ల బటర్ ఫ్లై, 100 మీటర్ల బ్రెస్ట్ విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచి మూడు బంగారు పతకాలు దక్కించుకోవడంతో పాటు దేశ వ్యాప్తంగా పాల్గొన్న 518 మంది క్రీడాకారుల్లో అత్యంత ప్రతిభ చూపడంతో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ ద్వారా ఛాంపియన్‌షిప్‌ను అందుకున్నారు. ఈ విశేష ప్రతిభతో వచ్చే ఏడాది సెప్టెంబరులో సింగపూర్‌లో జరగబోయే అంతర్జాతీయ పారా స్విమింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలకు దేశం తరపున ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించినట్లు పారా కమిటీ ఆఫ్ ఇండియా కమిటీ ప్రకటించింది. రవి కార్తిక్ 2020 నుంచి వరుసగా 5 జాతీయ పారా ఈత పోటీల్లో పాల్గొన్నాడు. ఒక్కో ఏడాది మూడేసి చొప్పున 15 బంగారు పతకాలు సాధించారు. 2023లో ఈజిప్టులో జరిగిన పోటీల్లోనూ రెండు అంతర్జాతీయ పతకాలు దక్కించుకున్నాడు. అతడి తండ్రి బుడిగిన నాగేంద్రకుమార్ న్యాయవాది. తల్లి గృహిణి. రవి కార్తిక్ ప్రస్తుతం డిగ్రీ చదువుతున్నాడు.

ప్రజా పోరాటాలతో ప్రతిపక్ష పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిపక్షంలో ఉన్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కేసుల భయంతో ప్రజా సమస్యలు లేవనెత్తలేని పరిస్థితుల్లో ఉన్నారని, కాబట్టి సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలతో ప్రతిపక్ష పాత్ర పోషించాలని పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం నూజివీడు అమర్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యకర్తల సమావేశం పార్టీ జిల్లా కార్యదర్శి డి.హరినాథ్ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా శంకర్‌తో పాటు రాష్ట్ర కార్యదర్శి బి.బంగార్రావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, ఆర్ఎస్సెస్ చాప కింద నీరులా వ్యాపించేందుకు ప్రయత్నం చేస్తున్నాయని, అందుకు అధికార మిత్రపక్షాలైన తెదేపా, జనసేనలు సహకరిస్తున్నాయని ఆయన ఆరోపించారు. డిసెంబర్ 4న విజయవాడలో తలపెట్టిన ప్రజాహక్కుల ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ రాష్ట్ర నాయకులు అరుణ, కల్యాణ్ కృష్ణ, ఈశ్వర్, నాగేశ్వరరావు, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గేట్ సన్నద్ధతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సురేశ్ కుమార్

నూజివీడు, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీ శ్రీకాకుళం, నూజివీడు క్యాంపస్‌లలోని ఈసీఈ, ఈఈఈ విద్యార్థులకు బుధవారం గేట్ పరీక్ష సన్నద్ధతపై ఇంటరాక్టివ్ సెషన్‌ను టీఎన్‌పీసీ కోఆర్డినేటర్ సీహెచ్ సతీశ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అతిథిగా గేట్ ప్రో డైరెక్టర్ వి.ఎస్.ఆర్.సురేశ్ కుమార్ పాల్గొని గేట్ పరీక్ష ప్రాధాన్యం, అవకాశాలు, పరీక్ష సన్నద్ధతపై సమర్థ వ్యూహాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.చెన్నారావు, డీఏవో సతీశ్ కుమార్, కె.సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ ఉపాధ్యాయ కొలువుల భర్తీకి దరఖాస్తులు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: భీమడోలు సీబీఎస్‌సీ ఎయిడెడ్ ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ కొలువుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. అర్హులు ఈ నెల 28లోపు దరఖాస్తు చేసి, ఆ పత్రాలను నిర్ణీత గడువులోపు పాఠశాలలో సమర్పించాలన్నారు. లేదా cse.in/aided recruitment వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



దుకాణాల వద్ద రత్నప్రసాద్ తదితరులు

బాలలతో పని చేయిస్తే అనుమతులు రద్దు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: బాలలతో హోటళ్లు, దుకాణాల్లో పనులు చేయిస్తే అనుమతులు రద్దు చేయిస్తామని, యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా కార్మికశాఖ సహాయక కమిషనర్ నాగేశ్వరరావు, డీసీపీవో కె.సూర్యచక్రవేణి, ఏఎల్‌ఎస్ సమన్వయకర్త రాధాకృష్ణతో కలిసి నగరంలోని వివిధ హోటళ్లు, దుకాణాలను బుధవారం తనిఖీ చేశారు. యజమానులు, సిబ్బందికి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ.. ఎవరైనా బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే టోల్‌ఫ్రీ నంబర్లు 1098, 15100కు సమాచారం ఇవ్వాలని కోరారు. డిసెంబరు 14న ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, రాజీ యోగ్యమైన క్రిమినల్, సివిల్, కుటుంబ వివాదాలు, బ్యాంకు కేసులు పరిష్కరించుకోవాలని వారు కోరారు.

విత్తులోనే.. విపత్తు!
- నాణ్యత లేని రొయ్య సీడ్‌తో నష్టాలు
- పుట్టగొడుగుల్లా అనధికార హేచరీలు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే:

- యండగండికి చెందిన సుబ్బరాజు 20 ఎకరాల్లో సాగు ప్రారంభించగా కొద్ది రోజులకే రొయ్యలకు వైట్‌గట్ వ్యాధి సోకింది. దీంతో మేత వినియోగం, సాగు వ్యయం పెరిగింది. పట్టుబడి చేశాక ఎకరానికి రూ.లక్ష చొప్పున నష్టం లెక్క తేలింది.
- భీమవరం మండలం లోసరికి చెందిన సత్యనారాయణ చెరువులో వేసిన రొయ్య పిల్లలు 15 రోజులకే మృతి చెందాయి. ఎకరాకు సీడ్ కొనుగోలు, రవాణాకు కలిపి రూ.35 వేలు ఖర్చయింది. నాలుగెకరాలకు రూ.1.40 లక్షల నష్టం వాటిల్లింది.

ఉమ్మడి జిల్లాలో ఇలా

రొయ్యల సాగు విస్తీర్ణం
1.25 లక్షల ఎకరాలు
వార్షిక టర్నోవర్
రూ.18వేల కోట్లు (సుమారు)

డాలర్ల పంటగా గుర్తింపు పొందిన రొయ్యల సాగులో సీడ్ ఎంపికే కీలకం. నాణ్యమైన రొయ్య పిల్లలను వేస్తే వ్యాధులను తట్టుకుని నిలబడి మంచి దిగుబడి వస్తుంది. కానీ నాణ్యమైన సీడ్ అందుబాటులో లేక సాగుదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీలపై తగిన పర్యవేక్షణ లేకపోవడమే దీనికి ప్రధాన కారణం. పెద్ద హేచరీల్లో అమ్ముడుపోని పిల్ల రొయ్యల్ని కొందరు దళారులు తక్కువ ధరకు కొని తీసుకొచ్చి స్థానికంగా ఉన్న చిన్న చెరువుల్లో మరో పది రోజులు పెంచి స్థానిక రైతులకు విక్రయిస్తున్నారు. అక్రమంగా నిర్వహిస్తున్న ఇలాంటి కేంద్రాల్లో కొనుగోలు చేసిన పిల్ల రొయ్యల ద్వారా వ్యాధులు వ్యాపించి చుట్టుపక్కల చెరువులన్నీ తుడుచుపెట్టుకుపోతున్నాయి.



☛ భీమవరం మండలంలో నిర్వహిస్తున్న రొయ్య పిల్లల (సీడ్) చెరువులు ఇవి. నర్సరీలుగా పిలిచే వీటిలో ఎలాంటి సాంకేతిక పరిజ్ఞానం, పరిశుభ్రత ఉండవు. ఇవన్నీ ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నవే. జిల్లాలో అనుమతి ఉన్న హేచరీలు రెండు మాత్రమే ఉన్నాయి. అవి ఒక శాతం అవసరాల్ని మాత్రమే తీరుస్తాయి. ఇక్కడి రైతులు తూర్పుగోదావరి, విశాఖపట్నం, ఒంగోలు, నెల్లూరు, పాండిచ్చేరి ప్రాంతాల నుంచి సీడ్ దిగుమతి చేసుకోవాల్సిందే. దీనికి ఎక్కువ వ్యయం అవుతుండటంతో కొందరు రైతులు అనధికార హేచరీలను ఆశ్రయిస్తున్నారు.

తరచూ తనిఖీలు

హేచరీల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే. ప్రభుత్వ పరంగా తరచూ తనిఖీలు జరుగుతున్నాయి. నర్సరీల్లో రొయ్య పిల్లల పెంపకం, స్థానికంగా సీడ్ ఉత్పత్తి చేయకూడదు. అలాంటివి మా దృష్టికొస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

- ప్రసాద్, జిల్లా ఇన్‌ఛార్జి మత్స్య అభివృద్ధి అధికారి

ఆలయంలో స్వర్ణాభరణాలు చోరీ
ఇద్దరి అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు నేరవార్తలు న్యూస్‌టుడే: రామాలయంలోకి చొరబడి స్వర్ణాభరణాలు, నగదు కాజేసిన ఘటనలో ఇద్దరిని ఏలూరు ఒకటో పట్టణ పోలీసుల అరెస్టు చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. స్థానిక రామకోటి ప్రాంగణంలోని రామాలయంలో ఈ నెల 17న రాత్రి చోరీ చోటుచేసుకుంది. గర్భగుడి తలుపు తాళాలను ఇనుప రాడ్డుతో పగులగొట్టిన దొంగలు లోపలికి చొరబడి సీతమ్మ విగ్రహం నుంచి బంగారు మంగళసూత్రం, చెవి పోగులు, రామయ్య వెండి మొలతాడు, హుండీలోని నగదు... ఇలా మొత్తం 12.640 గ్రాముల స్వర్ణాభరణాలు, 733 గ్రాముల వెండి వస్తువులు, రూ.5 వేల నగదు దోచుకెళ్లారు. దీనిపై కేసు నమోదు చేసిన ఒకటో పట్టణ సీఐ సత్యనారాయణ దర్యాప్తు చేపట్టారు. ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ ఆదేశానుసారం డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. స్థానిక గజ్జలవారి చెరువు రోడ్డులో బుధవారం అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. చోరీకి పాల్పడింది ఏలూరు తూర్పువీధికి చెందిన తిరుమల రామశివ, మరడానిరంగారావు కాలనీకి చెందిన గడ్డి విజయ్‌కుమార్ అలియాస్ నానిగా నిర్ధారించుకొని వారిని అరెస్టు చేశారు. చోరీకి గురైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

ఎంపీటీసీ సభ్యుడి మృతి ఘటనపై.. పోలీసుల అదుపులో 11 మంది

ముసునూరు, న్యూస్‌టుడే: జేసీబీ విషయంలో తలెత్తిన వివాదంలో ఎంపీటీసీ సభ్యుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనకు సంబంధించి అనుమానితులుగా గుర్తించిన 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. చిత్తూరు జిల్లా పాల సముద్రానికి చెందిన తెదేపా ఎంపీటీసీ సభ్యుడు కంచి జగన్నాథరాజును ముసునూరు మండలం కాట్రేనిపాడుకు చెందిన గుత్తి నాగరాజు తదితరులు ఈనెల 21న కిడ్నాప్ చేసి ముసునూరుకు తీసుకొచ్చారు. ఏడాది క్రితం జగన్నాథం నాగరాజు నుంచి ఫైనాన్స్ ఒప్పందం ప్రకారం జేసీబీని కొనుగోలు చేశారు. అప్పటి నుంచి జగన్నాథరాజు కిస్తీలు కట్టకపోగా.. ఫోన్ చేసినా స్పందించ లేదు. దీంతో నాగరాజు రెండు నెలల క్రితం ముసునూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫైనాన్స్ చెల్లించాలని జేసీబీ కంపెనీ నుంచి ఒత్తిడి రావడంతో నాగరాజు మరికొంతమంది అతడి కోసం చిత్తూరు వెళ్లారు. అక్కడ నుంచి జగన్నాథరాజును కారులో ఎక్కించుకుని ముసునూరుకు తీసుకువస్తుండగా..తనను కొందరు కిడ్నాప్ చేసినట్లు మార్గమధ్యంలో జగన్నాథరాజు భార్యకు ఫోన్లో సందేశం పంపాడు. ఈ విషయాన్ని రాధిక చిత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కారులో తీసుకువస్తుండగా జగన్నాథరాజు బహిర్భూమి పేరిట కారు ఆపించి పారిపోతుండగా నాగరాజు బృందం వెంబడించింది. తరువాత జగన్నాథరాజు దగ్గరలోని పామాయిల్ తోటలో అచేతనంగా పడి ఉన్నట్లు గుర్తించారు. నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలిసిన పోలీసులు నాగరాజుతో పాటు ఈ కేసులో అనుమానితులుగా ఉన్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. జగన్నాథరాజు భార్య రాధిక..తన భర్తను నాగరాజు తదితరులు హత్య చేశారని ఆరోపించారు. దీనిపై చిత్తూరు, నూజివీడు, ముసునూరు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 131, 140, 151 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

పర్యాటక వీసాలతో మోసం
నిందితుడి అరెస్టు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులున్న యువకులను లక్ష్యంగా చేసుకుంటాడు.. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని.. బాగా డబ్బు సంపాదించవచ్చని నమ్మబలుకుతాడు. గల్ఫ్, ఒమన్ తదితర దేశాలకు ఉద్యోగ వీసాకు బదులు పర్యాటక వీసాలు ఇప్పిస్తూ.. అమాయకులను మోసం చేసిన కేసులో ఓ నిందితుడ్ని ఏలూరు ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం బొండాడ గ్రామానికి చెందిన దుండి జాన్‌బాబు, ప్రస్తుతం ఒమన్‌లో ఉంటున్న పాలడుగు ప్రసాద్ అమాయకులను మోసం చేస్తూ... పర్యాటక వీసాపై విదేశాలకు పంపుతున్నారు. ఏలూరు బావిశెట్టివారిపేటకు చెందిన బయలపాటి దుర్గాప్రసాద్ తన భార్య నాగమ్మను పని నిమిత్తం విదేశాలకు పంపాలని జాన్‌బాబును సంప్రదించారు. అతడు పాలడుగు ప్రసాద్‌తో మాట్లాడి.. ఒమన్ దేశం పంపుతామంటూ రూ.30 వేలు వసూలు చేశారు. 2023లో నాగమ్మను పర్యాటక వీసాతో అక్కడికి పంపగా- పోలీసులు అరెస్టు చేశారు. విషయం తెలుసుకున్న బాధితుడు దుర్గాప్రసాద్ అప్పట్లో ఒకటో పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా- వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు కెనాల్ రోడ్డులో ప్రధాన నిందితుడు దుండి జాన్‌బాబును బుధవారం సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎస్సై మదీనా బాషా, హెడ్‌కానిస్టేబుల్ రాధాకృష్ణ, కానిస్టేబుళ్లు యశ్వంత్‌కుమార్, సురేశ్ కుమార్ అరెస్ట్ చేశారు.

ఏలూరు

•ఏలూరు •దెండులూరు •ఉంగుటూరు

అయొడిన్ లోపంతో వ్యాధులు


గోడపత్రాలు ఆవిష్కరించిన డీఎంహెచ్‌వో తదితరులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: అయొడిన్ లోపంతో అనేక వ్యాధులు సంక్రమిస్తాయని, దీన్ని అధిగమించాలంటే అయొడైజ్డ్ ఉప్పు వినియోగించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ సూచించారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి కార్యాలయంలో అయొడైజ్డ్ ఉప్పుతో కలిగే ప్రయోజనాలను రూపొందించిన గోడపత్రాలను బుధవారం ఆవిష్కరించి మాట్లాడారు.

సీఆర్‌ఆర్‌లో అవగాహన సదస్సు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్థానిక సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 'ఇంటర్న్‌షిప్‌లో వివిధ రంగాలు'పై జరిగిన సదస్సుకు అమరావతి సాఫ్ట్‌వేర్ ఇనోవేషన్స్ సంస్థ ఛైర్మన్ సీహెచ్ అనిల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా రంగంలో ఇంటర్న్‌షిప్‌కు ప్రాముఖ్యత ఉందని చెప్పారు. కరస్పాండెంట్ విష్ణు మోహన్, ప్రధానాచార్యుడు రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరం తనిఖీ

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: అడవికొలను సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ శిబిరాన్ని ఎంపీడీవో విజయకుమారి బుధవారం తనిఖీ చేశారు. స్థానికులతో మాట్లాడి సేవల వివరాలు ఆరా తీశారు. అధిక రుసుములు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు తూర్పువీధి: 80081 23847	ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483	ఉంగుటూరు: 79933 00492

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: సుంకరవారితోట శివారు మాదేపల్లి ఇందిరా కాలనీ ప్రధాన రోడ్డులో వీధి దీపం సరిగా వెలగడం లేదు. రాత్రివేళ చీకట్లో భయం భయంగా రాకపోకలు సాగిస్తున్నాం. **- సీహెచ్ మునేశ్వరరావు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **- కె.శేషగిరి, విద్యుత్తు ఏఈ**

సమస్య: పడమరవీధి గాంధీ మైదానం కూడలి నుంచి అంబికా థియేటర్ కూడలికి వెళ్లే రోడ్డులోని కాలువలో ఇసుక మేట వేసింది. మురుగునీరు వెళ్లే దారి లేక నిల్వ ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. **- జి.గంగరాజు, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో మురుగు కాలువలో పూడిక తీయిస్తాం. **- శివారెడ్డి, నగరపాలక ఉప అధికారి**

సమస్య: తంగెళ్లమూడి ఎమ్మార్సీ కాలనీ రామాలయం రోడ్డులోని కాలువలో నెలల తరబడి పూడిక తీయడం లేదు. రాత్రివేళ దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. **- నరసయ్య, ఎమ్మార్సీ కాలనీ**

సమాధానం: కాలువలో పూడిక తీయించి, దోమల నివారణకు మందు పిచికారీ చేయిస్తాం. **- భానుప్రతాప్, నగరపాలక అధికారి**

సమస్య: సత్రంపాడు హౌసింగ్ బోర్డు కాలనీ నుంచి సచివాలయానికి వెళ్లే రోడ్డులోని మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. **- పి.సాంబశివరావు, స్థానికుడు**

సమాధానం: కాలువలో చెత్తాచెదారం తొలగింపజేస్తాం. **- జి.చంద్రయ్య, నగరపాలక సహాయాధికారి**

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే

సమస్య: అశోక్‌నగర్‌లోని కేపీడీటీ పాఠశాల ఎదురు వీధిలో వీధి కుక్కల బెడద అధికంగా ఉంటోంది. పిల్లలు, వృద్ధులు ఇంట్లో నుంచి బయటకొచ్చేందుకు భయపడుతున్నారు. **- మానం కుశకుమార్, స్థానికుడు**

సమాధానం: నగరంలోని కుక్కలకు సంతాన నిరోధక శస్త్రచికిత్సలు చేయిస్తాం. **- అంజియ్య, నగరపాలక అదనపు కమిషనర్**

గణపవరం, న్యూస్‌టుడే

సమస్య: పిప్పర- తాడేపల్లిగూడెం మార్గం వెంబడి ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఆయా దుకాణాల వద్ద వాహనాలు నిలుపుదల చేస్తుండటంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, పిప్పర**

సమాధానం: దుకాణదారులతో మాట్లాడి వాహనాలు నిలపకుండా చూస్తాం. **- ఎం.మణికుమార్, ఎస్సై**

పెదపాడు, న్యూస్‌టుడే

సమస్య : అమృతలింగంపేట వద్ద ఏలూరు కాలువ నుంచి గోగుంట వెళ్లే సప్లై చానల్ పైనున్న కల్వర్టుకు ఇరువైపులా రక్షణ గోడలు నిర్మించలేదు. ఫలితంగా రాత్రివేళ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. **- వాహన చోదకులు**

సమాధానం: ఏలూరు- పెరికీడు రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. కల్వర్టు రక్షణ గోడలు నిర్మించేందుకు సమయం పడుతుంది. ఈ లోపు తాత్కాలిక రక్షణ చర్యలు చేపడతాం. **- శేషుకుమార్, ర.భ.శాఖ ఏఈ**

పదిలమా.. శిథిలమా..!

• లీకేజీలతో నాచుపడుతున్న ట్యాంకులు • మొక్కలు పెరిగి పెచ్చులూడుతున్న వైనం


నాయుడుగూడెంలో పాచి పట్టిన ట్యాంకు పైభాగం

పెదపాడు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలకు తాగునీరందించే ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ రోజురోజూకు తీసికట్టుగా మారుతోంది. ఫలితంగా ట్యాంకులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వీటిని నిర్మించి దశాబ్దాలు అవుతుండటంతో.. కొన్నిచోట్ల పెచ్చులూడి పడుతున్నాయి. మరికొన్నిచోట్ల పిల్లర్లు, పైభాగం దెబ్బతిని... నీరు లీకేజీ అవుతోంది. ఫలితంగా పాచిపట్టి చిత్తడిగా మారుతున్నాయి. ట్యాంకులను నీటితో నింపాక, విలువైన జలం లీకేజీల కారణంగా వృథా అవుతోంది. ప్రతి పదిహేను రోజులకోసారి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాల్సి ఉండగా- ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు శూన్యం.

అంతటా అపరిశుభ్రం...

వసంతవాడలోని ఓవర్‌హెడ్ ట్యాంకు పైభాగంలో మొక్కలు మొలిచి.. అవికాస్త మానులుగా మారుతున్నాయి. ఫలితంగా గోడలు బీటలు వారుతున్నాయి. ట్యాంకు నిండితే నీరు లీకేజీ అవుతోంది. వీటిని వదిలిస్తే ప్రమాదం సంభవించే అవకాశముంది. నాయుడుగూడెం, పెదపాడు, తోటగూడెం, జయపురం తదితర గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంకు భాగంలో శుభ్రం చేసేందుకు అమర్చిన రెయిలింగ్ పాడయ్యాయి. దాంతో ట్యాంకు మెట్లు ఎక్కేందుకు సిబ్బందికి ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.


వసంతవాడ ట్యాంకుపై పెరుగుతున్న మొక్కలు

మరమ్మతులు చేయిస్తాం..

గ్రామాల్లో లీకేజీ అవుతున్న ట్యాంకులను మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మరమ్మతులకు గురైన ట్యాంకులను గుర్తించి, వాటిని బాగు చేయించేందుకు నివేదికలు రూపొందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అనుమతులు మంజూరై, నిధులు రాగానే మరమ్మతులు చేపడతాం.

- శ్రీనివాస్, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ


గెలుపొందిన విద్యార్థులతో ఎల్‌బీసీ ఉన్నత పాఠశాల ప్రతినిధులు

వెల్లివిరిసిన ప్రతిభ!

'ఈనాడు' ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: పిల్లల్లో దాగున్న ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు 'ఈనాడు' ఆధ్వర్యాన ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక పడమర వీధిలోని ఎల్‌బీసీ ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు జరిగాయి. 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం'పై నిర్వహించిన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎస్‌కే లషీరా(ప్రథమ), ఎం.దీపక్ కుమార్(ద్వితీయ), పి.రక్షిత(తృతీయ) స్థానాల్లో నిలిచారు. వీరికి పాఠశాల డైరెక్టర్లు ఎం.శ్రీనివాసరావు, ఎం.కుమార్, జి.సత్యనారాయణ, వైఆర్ కిశోర్ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. టి.శ్రీదేవి, ఎస్.శ్రీను, ఎన్.నిర్మల, ఎన్.దేవకుమారి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

న్యూ జనరేషన్ ఉన్నత పాఠశాలలో.. స్థానిక గాంధీనగర్‌లోని న్యూ జనరేషన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకూ 'అంతర్జాలం వినియోగంతో లాభనష్టాలు- విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం'పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పి.తన్మయి(ప్రథమ), సీహెచ్ చంద్రిక(ద్వితీయ), పి.కిరణ్య(తృతీయ) స్థానాలు కైవసం చేసుకున్నారు. వీరు వీరికి కరస్పాండెంట్ ఎన్‌ఆర్‌కేప ప్రసాద్, డైరెక్టర్ ఎన్.బేబీ బహుమతులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా స్టీఫెన్, షమీమ్, సువర్ణ, కల్యాణి, భవాని వ్యవహరించగా- ప్రధానోపాధ్యాయిని ఎన్.వందన పోటీలు పర్యవేక్షించారు.


విజేతలతో న్యూ జనరేషన్ ఉన్నత పాఠశాల యాజమాన్యం

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: ఎంపీ

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ తోడ్పాటునివ్వాలని ఎంపీ మహేశ్ కుమార్ అన్నారు. 'వన మహోత్సవం'లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో బుధవారం మొక్క నాటి నీరు పోశారు. ఆయన మాట్లాడుతూ.. భావితరాలకు పర్యావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇందుకోసం మొక్కలు నాటి, కాపాడాలని కోరారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, ట్రైకార్ ఛైర్మన్ బి.శ్రీనివాస్ తదితరులున్నారు.


మొక్కకు నీరు పోస్తున్న మహేశ్‌కుమార్

ఎన్డీయేతోనే రాష్ట్రాభివృద్ధి: ఎమ్మెల్యే

దెందులూరు, న్యూస్‌టుడే: ఎన్డీయేతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కొవ్వలిలో రూ.17 లక్షలు, దెందులూరులో రూ.9 లక్షలు, శ్రీరామవరంలో రూ.9 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల సమగ్ర ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ వారోత్సవాలు నిర్వహిస్తోందన్నారు. తద్వారా గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తోందన్నారు. ఎంపీడీవో శ్రీదేవి, నాయకులు మిల్లు బాబు, ఇప్పిలి వెంకటేశ్వరరావు, మండల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


భూమి పూజ చేస్తున్న ప్రభాకర్

పేదలకు మెరుగైన వైద్య సేవలు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రవ్యాప్తంగా పేదలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు ఎన్డీయే ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. స్థానిక పవరుపేటలోని విడిది కార్యాలయంలో 12, 13, 15 డివిజన్లకు చెందిన పలువురికి బుధవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. జి.శ్రీలక్ష్మికి రూ.75 వేలు, కె.దేవేంద్రరావుకు రూ.1.28 లక్షలు, ఎం.రాణికి రూ.62 వేల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా తెదేపా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు. తెదేపా నగరాధ్యక్షుడు శివప్రసాద్, కార్పొరేటర్ కె.శ్రీనివాసరావు తదితరులున్నారు.


బాధితుల చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏపీ టిడ్కో ఛైర్మన్‌కు అభినందన

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ టిడ్కో ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వేములపాటి అజయ్‌కుమార్‌ను ఏలూరు జనసేన నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి పండ్ల బుట్ట అందజేసి అభినందనలు తెలిపారు. నాయకులు శేషు, సందీప్, ప్రసాద్, నాగేశ్వరరావు, తాతారావు, నాని పాల్గొన్నారు.


అజయ్‌కుమార్‌కు పండ్ల బుట్ట ఇస్తున్న నాయకులు

నేడు యర్రమిల్లిపాడులో వైద్య శిబిరం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా యర్రమిల్లిపాడు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఉంగుటూరు పీఎంపీ సంఘం, యర్రమిల్లిపాడు పంచాయతీ సంయుక్త ఆధ్వర్యాన శిబిరం ఉంటుందని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొచ్చెర్లకోట శ్రీనివాస్, బీఎస్‌బీ రాజు తెలిపారు. గుండె, కంటి, కీళ్లు, నరాల సమస్యలకు వైద్యులు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని వారు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లక్ష్మీగణపతికి అభిషేకాలు



ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సత్రంపాడులోని లక్ష్మీగణపతిస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు ఆలయానికి విచ్చేసి, స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వారికి అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మాలధారులకు భిక్ష అభినందనీయం

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక రామకోటి ప్రాంగణంలో అన్నపూర్ణ సహిత హరిహరపుత్ర అయ్యప్పస్వామి అన్నదాన సమాజం ఆధ్వర్యాన భిక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం ప్రారంభించారు. తొలుత స్వామికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మాలధారులకు భిక్ష ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. డిసెంబరు 16వ తేదీ వరకు 55 రోజులపాటు భిక్ష కొనసాగుతుందని ఆయన తెలిపారు. కమిటీ గౌరవాధ్యక్షుడు రామకృష్ణ, అధ్యక్షుడు మధు వెంకటరావు, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, జనసేన నేత అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి పట్టాలెక్కిస్తారా... పట్టనట్లు వదిలేస్తారా?

నేడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఎన్డీయే అధికారంలోకి వచ్చాక.. ఇప్పటి వరకు ఏలూరు సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించలేదు. తొలిసారిగా గురువారం సమావేశం జరగనుంది. గతంలో మెరుగైన వైద్య సేవలందించిన చరిత్ర ఈ ఆసుపత్రికి ఉంది. వైద్య కళాశాలగా మార్చాక, ఇంకా నాణ్యమైన సేవలందిస్తూ అభివృద్ధి దిశగా దూసుకుపోవాలి. కానీ, ఆసుపత్రిలో రోజురోజుకూ సేవలు సన్నగిల్లుతున్నాయి. ప్రతి కేసును గుంటూరు, విజయవాడకు సిఫార్సు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స చేసిన కేసులకు సంబంధించి ఆసుపత్రికి రావాల్సిన ఆదాయంలో గండిపడింది. గతంలో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అత్యధికంగా చేసిన ఘనత ఏలూరు సర్వజన ఆసుపత్రి సొంతం.



రోడ్లపైనే సహాయకులు.. ఆసుపత్రి ప్రాంగణంలో రోగుల బంధువులు, సహాయకుల సౌకర్యార్థం రూ.15 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన షెల్టర్ వైద్య కళాశాల అవసరాలకు వినియోగించుకుంటున్నారు. దీంతో రోగుల బంధువులు కాసేపు విశ్రాంతి తీసుకోవాలన్నా, భోజనాలు చేయాలన్నా రోడ్లే శరణ్యం. దీనికితోడు ఆసుపత్రి క్యాంటీన్ మూసేశారు. మళ్లీ టెండర్లు పిలిచి క్యాంటీన్‌ను పునఃప్రారంభిస్తే రోగులకు ఉపయుక్తంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు. తక్కువ ధరలకు పాలు, కాఫీ, టీలు, బిస్కెట్లు, ఇతర ఆహార పదార్థాలు అందిస్తామని, రాయితీపై ఆసుపత్రి ప్రాంగణంలో డెయిరీ పెట్టారు. కానీ, నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇవన్నీ ఆసుపత్రి అభివృద్ధికి ప్రతిబంధకాలుగా తయారయ్యాయి. ఈ దఫాలో కీలక నిర్ణయాలు తీసుకుని ప్రజలకు మంచి చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

సస్యరక్షణతో తెగుళ్ల నివారణ

పెదవేగి, న్యూస్‌టుడే: సస్యరక్షణ చర్యలతో తెగుళ్లను నివారించవచ్చని మండల వ్యవసాయాధికారిణి ముత్యాల ప్రియాంక అన్నారు. విజయరాయి-1, 2 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. వరి పొలాలను వ్యవసాయ, అనుబంధ అధికారులు, రైతులతో కలిసి పరిశీలించారు. సాగులో తీసుకోవాల్సిన మెలకువలను వారికి వివరించారు.

పాడి రైతులకు మినీ గోకులాలు వరం

ఉంగుటూరు, న్యూస్‌టుడే: మినీ గోకులాలు పాడి రైతులకు వరమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజ్‌మనోజ్ అన్నారు. స్థానిక మండల పరిషత్తు సమావేశ మందిరంలో మినీ గోకులాల లబ్ధిదారులతో బుధవారం సమావేశమై మాట్లాడారు. మండలానికి 65 మినీ గోకులాల షెడ్లు మంజూరైనట్లు చెప్పారు. షెడ్ల నిర్మాణ విధి విధానాలను వివరించారు.

తలసేమియా పిల్లలకు రక్తమార్పిడి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: స్థానిక సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని తలసేమియా చికిత్స భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన బుధవారం 13 మంది బాధిత చిన్నారులకు వైద్యులు రక్తమార్పిడి చేశారు. ఏర్పాట్లను రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ బీవీ కృష్ణారెడ్డి పరిశీలించారు. కార్యదర్శి సీతారామ్, వైద్యులు పాల్గొన్నారు.

విద్యుత్తు సమస్యల పరిష్కార వేదిక రేపు

ఉంగుటూరు, న్యూస్‌టుడే: నారాయణపురం విద్యుత్తు ఉప కేంద్రం కార్యాలయంలో వినియోగదారుల సమస్యలపై సీజీఆర్ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యాన శుక్రవారం పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఈ అంబేడ్కర్ తెలిపారు. సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ, సాంకేతిక సభ్యురాలు ఎస్ఎం మణి హాజరవుతారని, ఉంగుటూరు, నిడమర్రు మండలాల వినియోగదారులు పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

సాగునీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. మొత్తం ఆరు నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలను భీమడోలు డీఈఈ ఎం.వి.వి.ఎస్.ప్రసాద్ పర్యవేక్షిస్తారన్నారు. జలవనరులశాఖ ఏఈ రాము, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై రగడ


నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ ధనకొండ ఆదిలక్ష్మి అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సాంఘిక సంక్షేమ, ఆబ్కారీ, పోలీస్, రోడ్లు, భవనాలు, అటవీ, మత్స్య శాఖల అధికారులు గైర్హాజరుపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాన సమావేశాలకు సైతం ఎక్కువ శాతం మంది అధికారులు రాకపోవడంపై కాసేపు రగడ నెలకొంది. నిడమర్రులో చెత్త వేయడానికి స్థలం లేదని, దాంతో రహదారుల పక్కన పడేస్తున్నారని సర్పంచి ఉమామహేశ్వరరావు ఫిర్యాదు చేశారు. పెదనింద్రకొలను, పత్తేపురం, తోకలపల్లి గ్రామాల్లో రహదారులు అధ్వానంగా ఉన్నాయని, గత వైకాపా హయాంలో పలుమార్లు సమస్యను ప్రస్తావించినా, ఎవరూ పట్టించుకోడం లేదని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ నాగరాజు, వైద్యాధికారిణి భాగ్యశ్రీ, జడ్పీటీసీ సభ్యుడు కోడే కాశి, ఏవో అలివేలు, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు రూపశ్రీ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

గోదావరి జలాలు అందించాలి


ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: వెంకటాపురం పంచాయతీ ప్రజలకు గోదావరి జలాలు సరఫరా చేయాలని సీపీఎం నగర ప్రధాన కార్యదర్శి పి.కిశోర్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఒకటో పట్టణ నగర శాఖ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వెంకటాపురం పంచాయతీ నగరపాలక సంస్థలో విలీనం సందర్భంగా స్థానికులకు గోదావరి జలాలనే తాగునీరుగా సరఫరా చేస్తామని హామీఇచ్చారని గుర్తు చేశారు. పంచాయతీలో రోడ్లు, మురుగు కాలువల సౌకర్యాలను మెరుగుపర్చాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు తాడిపూడి రాజు, ఎల్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు

భీమడోలు, న్యూస్‌టుడే: క్షేత్ర స్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తామని, తదనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై వ్యవసాయాధికారులు, వీఆర్వోలు, రెవెన్యూ అధికారులతో బుధవారం సమీక్షించారు. తహసీల్దారు రమాదేవి మాట్లాడుతూ.. మండలంలో పద్నాలుగు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఆర్డీవో మాట్లాడుతూ... భూముల రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో నిర్వహించిన సభల ద్వారా వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. ఏవో ఎస్.పి.వి.ఉషారాణి, ఆర్ఐ కిరణ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్డీవో అంబరీష్

ఘంటా రంగారావు మృతికి నివాళి


ఘంటా రంగారావు (పాత చిత్రం)

పెదపాడు, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మామ ఘంటా రంగారావు(70) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సత్యవోలులోని స్వగృహానికి తరలించారు. రంగారావు పార్థివదేహాన్ని పలువురు సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుమారుడు, తెదేపా నేత ఘంటా ప్రసాదరావు, కోడలు పద్మశ్రీని పరామర్శించారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	లవ్ రెడ్డి
అంబిక మినీ	రామనగర్ బన్నీ
సాయిబాలాజీ	మా నాన్న సూపర్ హీరో
బాలాజీ	శ్వాగ్
సత్యనారాయణ స్క్రీన్ 1	విశ్వం
సత్యనారాయణ స్క్రీన్ 2	వేట్టయన్
సత్యనారాయణ స్క్రీన్ 3	వేట్టయన్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	దేవర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	ఇద్దరు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	డీల్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	లవ్ రెడ్డి / జనక అయితే గనక / వెనమ్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	దేవర
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	వేట్టయన్
ఎస్‌వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	విశ్వం

గడ్డి మందు తాగి ఆత్మహత్య


మహంకాళిరావు (పాత చిత్రం)

భీమడోలు, న్యూస్‌టుడే: పాత అంబరుపేటకు చెందిన ఓ వ్యక్తి గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వై.సుధాకర్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామానికి చెందిన గాలి మహంకాళిరావు(50) ఏడాది క్రితం పక్షవాతం బారిన పడ్డారు. తీవ్ర మనోవేదనకు గురై ఈ నెల 21న సాయంత్రం ఇంటి వద్దే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అపస్మారక స్థితికి చేరుకున్న ఆయన్ను కుటుంబ సభ్యులు హుటాహుటిన ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి దాటాక మృతి చెందారు. మృతుడి భార్య గాలి సిరివేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఉరేసుకొని సివిల్ ఇంజినీర్..

దెందులూరు, న్యూస్‌టుడే: ఉరేసుకొని సివిల్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన కొవ్వలిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... గ్రామానికి చెందిన సాయి(24) సివిల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. హనుమాన్ జంక్షన్‌కు చెందిన ఓ యువతితో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కొన్నాళ్లుగా దంపతుల మధ్య వివాదం నడుస్తోంది. వీరికి హనుమాన్ జంక్షన్ పోలీసుస్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ క్రమంలో సాయి బుధవారం ఇంటి వద్ద ఉరేసుకున్నారు. అతడ్ని కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఎస్సై శివాజీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి


గంగరాజు (పాత చిత్రం)

పెదవేగి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు చెరువులో పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన న్యాయంపల్లిలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్సై కె.రామకృష్ణ కథనం మేరకు.. గ్రామానికి చెందిన వృద్ధుడు చొప్పిల్లి గంగరాజు(75) బహిర్భూమికి లింగంకుంట చెరువు వద్ద కెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయి మునిగిపోయాడు. మధ్యాహ్నానికి మృతదేహం నీళ్లలో తేలియాడుతుండగా గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రి శవాగారానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇ-చలానాల రద్దుకు వినతి

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఆటోలు, ట్యాక్సీలపై ఇ-చలానాలు రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్‌రెడ్డికి విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఐటీయూ నాయకులు వినతిప్రతం అందజేశారు. నగరంలో స్టాప్‌లైన్ వైలేషన్ పేరుతో విధిస్తున్న ఇ-చలానాలు రద్దు చేసి, స్టాప్‌లైన్, జీబ్రాలైన్, సీసీ కెమెరాలు క్రమబద్ధీకరించాలని కోరారు. ఆటోలు, ట్యాక్సీలపై రూ.300 నుంచి రూ.30 వేల వరకు విధించిన ఇ-చలానాలతో చోదకులు తీవ్ర ఆందోళన గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి జీవో నంబర్ 21ను రద్దు చేయాలని వారు కోరారు. నాయకులు అమర్‌కుమార్, జె.గోపి, బి.చంద్రశేఖర్, ఎన్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.


రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

విస్తృతంగా వాహనాల తనిఖీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: స్థానిక టీటీడీ కల్యాణ మండపం కూడలిలో బుధవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆదేశానుసారం మూడో పట్టణ సీఐ కోటేశ్వరరావు తనిఖీలు నిర్వహించి, ధ్రువపత్రాల్లేని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు. ట్రాఫిక్ నిబంధనలు, శిరస్త్రాణ వినియోగంపై అవగాహన కల్పించారు.

వినాయక ఆలయంలో చోరీ

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: వినాయక ఆలయంలో చోరీ జరిగిన ఘటన నగర శివారులో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మార్కెట్ యార్డు సమీప వినాయక గుడి తాళాలను మంగళవారం అర్ధరాత్రి దాటాక దుండగులు పగులగొట్టి హుండీ ఎత్తికెళ్లిపోయారు. బుధవారం చోరీ జరిగినట్లు గుర్తించిన ఆలయ నిర్వాహకుడు శేషుబాబు గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలవరం
• పోలవరం • చింతలపూడి

లఘు చిత్రానికి జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న రమేశ్

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో సామాజిక చైతన్యం విభాగంలో బయ్యనగూడేనికి చెందిన దర్శకుడు జంగాల రమేశ్ దర్శకత్వం వహించిన 'టార్చిలైట్' ఉత్తమ లఘు చిత్రం పురస్కారాన్ని దక్కించుకున్నట్లు రమేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆడపిల్లలపై అత్యాచారాలకు పాల్పడే వ్యక్తుల కుటుంబ సభ్యుల మనో వ్యధ, సమాజంలో వారు ఎదుర్కొనే అవమానాలు కథాంశంగా లఘుచిత్రం నిర్మించామన్నారు.

మత్తు రహిత సమాజం నిర్మిద్దాం

చింతలపూడి, న్యూస్‌టుడే: మత్తు రహిత సమాజ నిర్మాణానికి యువత నడుం బిగించాలని ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు అన్నారు. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త భారత్' కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ వినియోగంతో కలిగే దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రిన్సిపల్ సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

10 AM to 1 PM మేమున్నాం.. మీకు తోడుగా..
జంగారెడ్డిగూడెం : 80085 74478
కొయ్యలగూడెం : 80085 74947
చింతలపూడి : 76759 19086

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: చింతలపూడి మెరక వీధిలో డ్రెయిన్లపై మూతలు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి కిందపడుతున్నారు. **- ఆర్వీఎస్ నారాయణ, స్థానికుడు**

సమాధానం: డ్రెయిన్లపై మూతలు ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **- పావని, కమిషనర్**

పప్పుచారుతో సరి!

● అంగన్‌వాడీ కేంద్రాలకు చేరని గుడ్లు ● చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఎదురుచూపు

పోలవరం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు బలవర్ధక పోషకాహారం అందించాలన్నది ప్రభుత్వ సంకల్పం. అందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. మరి ఆయా సరకులు సక్రమంగా సరఫరా జరగడం లేదు. ముఖ్యంగా గుడ్ల సరఫరా అంతంత మాత్రంగా ఉంది. దీనిపై తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోలవరం మండలంలో 89 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో 1630 మంది చిన్నారులు ఉన్నారు. వీరికి నెలకు 25 రోజులు పాటు ఉడికించిన గుడ్లు పెట్టాలి. అలాగే గర్భిణులు 203, బాలింతలు 254 మందికి నెలకు 25 చొప్పున మొత్తం 52,175 ఇవ్వాలి.


కేంద్రంలో ఖాళీగా ఉన్న గుడ్ల ట్రేలు

వారానికి 13,043 చొప్పున ప్రతి వారం గుత్తేదారుడు సరఫరా చేయాలి. ఈ నెలలో మొదటి రెండు వారాలు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా అయ్యాయి.

నాలుగో వారం వచ్చినా..

మూడో వారానికి సంబంధించి గుడ్లు నేటి వరకు రాకపోవడంతో చిన్నారులకు ఆయాలు పప్పుచారుతో సరిపెడుతున్నారు. నాలుగో వారం ప్రవేశించినా ఇప్పటి వరకు సరఫరా చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటు గర్భిణులు, బాలింతలు గుడ్ల కోసం అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నారు. వచ్చిన వెంటనే అన్నీ ఒకేసారి అందజేస్తామని కార్యకర్తలు చెబుతున్నారు. రోజుకొకటి చొప్పున వారంలో అయిదు గుడ్లు తినాల్సిన చిన్నారులు రెండు వారాలకు కలిపి ఒకేసారి ఇచ్చి ప్రయోజనం ఏంటో అధికారులకే తెలియాలి. దీనిపై కొయ్యలగూడెం ఇన్‌ఛార్జి సీడీపీవో తులసీ మాట్లాడుతూ గుత్తేదారుడు గుడ్లు ఆలస్యంగా సరఫరా చేస్తున్న విషయం గత నెలలో గుర్తించి హెచ్చరించామన్నారు. ఇదే రీతిన కొనసాగితే ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు.


అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు


పోలీసులతో సమీక్షిస్తున్న న్యాయమూర్తులు కిశోర్‌కుమార్, తేజస్వి

డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెంలో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సీహెచ్ కిశోర్‌కుమార్ తెలిపారు. కోర్టు సముదాయంలో లోక్ అదాలత్‌కు సంబంధించి జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కేవీఎస్ఆర్ తేజస్వితో కలిసి బుధవారం పోలీసులు, న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఆ మేరకు కృషి చేయాలని సూచించారు.


మాట్లాడుతున్న రోషన్ కుమార్

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

లింగపాలెం, న్యూస్‌టుడే: పట్టభద్రులు ఓటు నమోదు చేసుకుని, తమ హక్కును వినియోగించుకుని, సరైన నాయకుడిని ఎన్నుకోవాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఈ మేరకు లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలో బుధవారం ఓ పాఠశాలలో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమలో ఆయన పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ నజీముల్లాషా మాట్లాడుతూ గతంలో ఓటు హక్కు వినియోగించుకున్న వారు సైతం మళ్లీ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరి శ్యామ్, చౌటుపల్లి విక్రమ్ కిశోర్, చలపతిరావు, ముసునూరి రాము, గారపాటి బుజ్జియ్య, రామ్మోహనరావు, మోరంపూడి ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా తెదేపా


రాళ్లకుంటలో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన వెంకటరాజు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: తెదేపా అంటేనే అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా అని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. 'పల్లె పండగ' సందర్భంగా బుధవారం ద్వారకాతిరుమల మండలం రామసింగవరం, జి.కొత్తపల్లి, మద్దులగూడెం, సీహెచ్ పోతేపల్లి, కోడిగూడెం, రాళ్లకుంట, దొరసానిపాడు, గుండుగొలనుకుంట, వెంకటకృష్ణాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగిపోయిన అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులెత్తిస్తూ.. రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో 85 గ్రామ పంచాయతీలకు ఉపాధి హామీ నిధులు రూ.21 కోట్లు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. నాయకులు లంకా సత్యనారాయణ, పోలిన శ్రీను, నాదెండ్ల వేణు తదితరులు పాల్గొన్నారు.





ఉత్సాహంగా.. విశ్లేషణాత్మకంగా..!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం శ్రీచైతన్య ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన పోటీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఇంటర్నెట్‌తో లాభనష్టాలు'-'విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం'అనే అంశంపై పోటీ నిర్వహించారు. ప్రథమ స్థానంలో సీహెచ్ జోషిత, ద్వితీయ పి.అక్షయ, తృతీయ వై.అంజలి నిలిచారు. వీరికి పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాసరావు, ఏవో కె.శ్రీనివాస్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.రామ్మోహన్, మైథిలి తదితరులు పాల్గొన్నారు.

'రూ.10 నాణేలు చెల్లుతాయి'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రూ.10 నాణేలు చెల్లుతాయని, వాటి వినియోగంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని బ్యాంకు ఆఫ్ బరోడా బుట్టాయగూడెం శాఖ మేనేజరు నాగశేషుకుమార్ తెలిపారు. దీనిపై బుట్టాయగూడెం తదితర గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు బుధవారం తెలిపారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ నాణేలను వినియోగంలోనే ఉంచినట్లు పేర్కొన్నారు.

రీసర్వే లోపాలపై వినతుల స్వీకరణ

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: భూముల రీసర్వే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ చెల్లన్న దొర పేర్కొన్నారు. కొయ్యలగూడెం పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం పరింపూడి, బోడిగూడెం, అచ్యుతాపురం రెవెన్యూ గ్రామాల పరిధిలో రీసర్వే లోపాలపై రైతుల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ వినతులు వచ్చిన 15 రోజుల్లోగా వాటిని పరిష్కరిస్తామని చెప్పారు. మొత్తం 47 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఆర్ఐ దివ్య, సర్పంచులు ముప్పిడి విజయకుమారి, మద్దిపాటి నాగమణి పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక చట్ట సాధనకు ఉద్యమం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మన్యంలో ఆదివాసీల ఉద్యోగ నియామకాల చట్ట సాధనకు దశల వారీ ఉద్యమం చేపడుతున్నట్లు ఆదివాసీ ఐకాస జిల్లా ఛైర్మన్ మొడియం శ్రీనివాసరావు తెలిపారు. ఐకాస, ఆదివాసీ సంక్షేమ పరిషత్తు నాయకుల సమావేశం బుట్టాయగూడెం మండలం బూసరాజుపల్లి శివారు సింగన్నపల్లి కాలనీలో బుధవారం నిర్వహించారు. చట్టం చేయాలని కోరుతూ గవర్నర్, ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేలకు పోస్టుకార్డులు పంపుతామన్నారు. నాయకులు కాకి మధు, తెల్లం రాములు, రవ్వా బసవరాజు, సోడెం ముక్కయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న నాయకులు

'కమ్యూనిస్టుల పోరాటాలతోనే సంక్షేమ పథకాలు'

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: కమ్యూనిస్టుల పోరాటాలతోనే ప్రజలకు చట్టాలు, హక్కులు కలిగి, సంక్షేమ పథకాలు అందుతున్నాయని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. పార్టీ మండల కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం బుట్టాయగూడెంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భాజపా అధికారంలోకి వచ్చాక విద్య, వైద్యం ఖరీదైనవిగా మారి పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు ప్రలోభాలకు గురికాకుండా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. తూర్పురేగులకుంటకు చెందిన చోడెం దుర్గ ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు పార్టీలో చేరారు. నాయకులు డేగా ప్రభాకర్, తలసాని రామారావు, మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వనజ

స్వీపర్ల గోడు పట్టించుకోండి

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పనిచేస్తోన్న స్వీపర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని స్వీపర్లు మండల విద్యాధికారి కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ స్వీపర్లకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రతి నెల అయిదోతేదీ లోపు వేతనాలు చెల్లించాలని, మూడు నెలల బకాయిలను వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈవో జె.సురేశ్‌బాబుకు అందజేశారు.

నమ్మండి.. ఆరోగ్య కేంద్రం దారండి!



కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బయ్యనగూడెం-సరిపల్లి మార్గంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు ప్రధాన రహదారి గుంతలతో నిండింది. దీంతో స్థానికులు నిత్యం నరకం చూస్తున్నారు. ఆసుపత్రి, దేవాలయం, పాఠశాలతో పాటు నివాస ప్రాంతాలకు వందలాది మంది అటుగా రాకపోకలు సాగిస్తుంటారు. అదిగో, ఇదిగో అంటూ గత ప్రభుత్వంలో అయిదేళ్లు గడిపేశారు. కనీసం గుంతలైనా పూడ్చి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


అదుపు తప్పితే మడుగులోకే..!

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: పట్టణంలోని శిఖామణి చర్చి వీధిలో మురుగు, వర్షం నీటితో సీసీ రోడ్డు మడుగులా మారింది. ఇరువైపులా డ్రెయిన్లు లేకపోవడంతో ఇళ్లలో వాడకం నీరు రోడ్డుపైకి చేరుతోంది. సుమారు అడుగు లోతు నిలుస్తుండటంతో వాహనదారులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. నడిచి వెళ్లేందుకు కూడా అవకాశం లేదు. దీనిపై పురపాలక కమిషనర్ రమణ మాట్లాడుతూ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అల్లుకుపోతున్నా.. అటు చూడరే..!

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: బయ్యనగూడెం వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ప్రధాన రహదారి పక్కన విద్యుత్తు స్తంభాన్ని కమ్మేస్తూ పిచ్చిమొక్కలు అల్లుకున్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఇటువంటి స్తంభాలు ఆ శాఖ సిబ్బందికి కనిపించకపోవడం గమనార్హం. ఈ విషయమై బయ్యనగూడెం విద్యుత్తు ఏఈ పి.సాంబయ్య మాట్లాడుతూ స్తంభాలపై అల్లుకున్న మొక్కలను తొలగించేందుకు చర్యలు తీసకుంటామని చెప్పారు.



చెత్త ఇలా.. ఆరోగ్యం ఎలా?

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ వసతి గృహానికి ఆనుకుని పేరుకుపోయిన చెత్తతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్, మండల పరిషత్తు కార్యాలయాలకు కూతవేటు దూరంలోనే ఈ దుస్థితి ఉంది. రహదారికి ఓ వైపు సాంఘిక సంక్షేమ, మరోవైపు గిరిజన సంక్షేమ వసతి గృహాలు ఉండటంతో దుర్వాసనలోనే జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. పడక గదులకు ఆనుకుని పెద్ద ఎత్తున చెత్త పడేయటంతో అనారోగ్యాలకు గురవుతున్నామని విద్యార్థుల వాపోతున్నారు.



అన్నపై తమ్ముడి కుటుంబం దాడి

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: అన్నపై దాడిచేసిన తమ్ముడు, అతడి కుటుంబ సభ్యులపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్సై జబీర్ కథనం మేరకు.. జంగారెడ్డిగూడెం డాంగేనగర్‌కు చెందిన వల్లపు రాంబాబు.. అతడి సోదరుడు కుమార్‌లు ఒకే ఇంట్లో వేరువేరు వాటాల్లో నివాసముంటున్నారు. కుమార్ భార్య నాగేశ్వరి.. దారికి అడ్డంగా దుస్తులు ఆరవేయడంతో వాటిని తీయాల్సిందిగా బయటి వ్యక్తితో రాంబాబు కబురుపెట్టాడు. దీంతో నాగేశ్వరి.. రాంబాబు భార్యతో మంగళవారం గొడవపడ్డారు. విషయం తెలుసుకున్న కుమార్ గొడవకు కారణం నీవేనంటూ తన అన్న రాంబాబుతో ఘర్షణ పడి పక్కన ఉన్న కర్రతో కొట్టగా అతడి భుజానికి తీవ్ర రక్త గాయమైంది. అలాగే అడ్డొచ్చిన భార్య, కుమారుడిపై సైతం దాడిచేసి చంపుతామని బెదిరించారు. దీనిపై క్షతగాత్రుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

జూద స్థావరంపై..

టి.నరసాపురం, న్యూస్‌టుడే: టి.నరసాపురం మండలం అప్పలరాజుగూడెంలో బుధవారం సాయంత్రం జూద స్థావరంపై దాడి చేసి, 14 మందిని అరెస్టు చేసి, రూ1,79,500, రెండు కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

చింతలపూడి, న్యూస్‌టుడే: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నాగిరెడ్డిగూడెంలో బుధవారం దాడులు నిర్వహించి 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు. అలాగే శెట్టివారిగూడెంలో నక్కా లక్ష్మి అనే మహిళ నుంచి 10 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఆరిఫ్, అబ్దుల్ ఖలీల్ పాల్గొన్నారు.



కొనసాగుతున్న వాగుల ఉద్ధృతి

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం మండలంలో కురుస్తున్న వర్షాలకు కొండ వాగుల ఉద్ధృతి బుధవారం కూడా కొనసాగింది. నీరు సున్నాలగండి, మెత్తప్పకోట మీదుగా ఇసుక కాలువలో కలిసి అక్కడి నుంచి పోలవరంలోని కడెమ్మ అవుట్‌ఫాల్ స్లూయిజ్ ద్వారా గోదావరిలోకి వెళుతోంది. పోలవరం తహసీల్దార్ కార్యాలయంలో 27 మి.మీ వర్షపాతం నమోదైంది.

కొవ్వాడ జలాశయంలో పెరిగిన నీటిమట్టం

పోలవరం, న్యూస్‌టుడే: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పోలవరం మండలం ఎల్ఎన్డీపేట సమీపంలో కొవ్వాడ జలాశయం నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతోంది. బుధవారం సాయంత్రానికి 90.05 మీటర్లకు చేరినట్లు పర్యవేక్షణ ఏఈ రాహుల్ చెప్పారు.

మైదానం కాదు.. చెరువే..!

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: అవును.. ఈ చిత్రంలో మీరు చూస్తుంది చెరువే. పచ్చటి తివాచీ కప్పుకుని మైదానంలా కనిపిస్తున్నది.. జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో సాగునీటి తటాకం. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండుకుండలా మారి పచ్చటి నాచుతో ఆటస్థలంలా తయారైంది. జీలుగుమిల్లి-బుట్టాయగూడెం ప్రధానం రహదారికి ఆనుకుని ఉండటంతో చూపరులను ఆకట్టుకుంటోంది. ఇటుగా పదుల సంఖ్యలో తటాకాలు ఉన్నప్పటికీ ఏటా ఇలా పచ్చగా మారుతుండటం గమనార్హం.



వాహనదారులు నిబంధనలు పాటించాలి: డీఎస్పీ

పోలవరం, న్యూస్‌టుడే: వాహనాదారులు నిబంధనలు పాటించడంతో పాటు మద్యం తాగి నడపొద్దని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని కన్నాపురం కూడలిలో బుధవారం సాయంత్రం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాదారులతో డీఎస్పీ మాట్లాడుతూ తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని, పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. వాహనాల తనిఖీలో సీఐ బాలసురేశ్‌బాబు, ఎస్సై పవన్‌కుమార్ పాల్గొన్నారు.

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్సై కుటుంబరావు అన్నారు. చింతలపూడి శివారులో బుధవారం వాహనాల తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


కన్నాపురం కూడలిలో వాహనదారులతో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

ఉచితంగా రూ.40వేలు ఇంజక్షన్

చింతలపూడి, న్యూస్‌టుడే: పట్టణంలోని ఆర్కేనగర్‌కి చెందిన కల్లేపల్లి కృష్ణకిశోర్‌కు హఠాత్తుగా గుండె పోటు రావడంతో కుటుంబ సభ్యులు చింతలపూడి ఏరియా ఆసుపత్రికి బుధవారం ఉదయం తీసుకొచ్చారు. ఆసుపత్రి వైద్యుడు రసూల్ రూ.40వేలు విలువ చేసే టెనెక్టోప్లాజ్ ఇంజక్షన్‌ను ఇచ్చి ప్రాణం కాపాడారు. ప్రాణాపాయం తప్పడంతో కొద్ది గంటల తర్వాత కుటుంబ సభ్యులు కృష్ణ కిశోర్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరుకు తరలించారు. గుండె పోటు వస్తే గోల్డెన్ అవర్‌లో ఆసుపత్రికి తీసుకొస్తే రోగి ప్రాణాలు కాపాడతామని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కొండ్రు దేవా తెలిపారు.


ఇంజక్షన్ చేస్తున్న వైద్యుడు రసూల్

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

టి.నరసాపురం, న్యూస్‌టుడే: సకాలంలో సస్యరక్షణ చర్యలతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని ఏవో బి.సుమలత అన్నారు. బండివారిగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పలు రకాల పంటలను పరిశీలించారు. పలువురు రైతులు తమకు తైవాన్ స్ప్రేయర్లు, బరకాలు రాయితీపై ఇప్పించాలని కోరారు. అనంతరం ఈపంట నమోదు చేసుకున్న రైతులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

విద్యార్థిని కొట్టిన ఉపాధ్యాయుడు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: వీరభద్రవరం ప్రాథమికోన్నత పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎస్.భువనేశ్వరరామ్‌కుమార్‌ను ఆ పాఠశాల ఉపాధ్యాయుడు కొట్టిన ఘటన బుధవారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. ఈ ఘటనపై అధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో రామమూర్తి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు విద్యార్థులు గొడవ పడుతున్న సందర్భంలో ఉపాధ్యాయుడు వారిని మందలిస్తూ కొట్టారన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తానని, ఉపాధ్యాయుడు విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామపెద్దలకు క్షమాపణలు చెప్పినట్లు ఎంఈవో పేర్కొన్నారు

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



నిరసన తెలుపుతున్న నాయకులు

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ భారత మహా సభ ఆధ్వర్యంలో కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద బుధవారం ధర్నా చేశారు. కార్యాలయం ముందు నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి జొన్నకూటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నిర్వాసిత కుటుంబాల్లో 18 ఏళ్లు నిండిన యువతకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ ప్రకటించాలన్నారు. పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. నాయకులు రంగనాథం, మండ్రు రామిరెడ్డి, మడకం రామన్న, కె.సుందర్రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఏపీవో పీవీఎస్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు.

వేతన బకాయిలు చెల్లించాలంటూ..


ప్రాంతీయ ఆసుపత్రి వద్ద కార్మికుల నినాదాలు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రి పారిశుద్ధ్య కార్మికులు ప్రధాన గేటు వద్ద నాలుగో రోజు బుధవారం ధర్నా చేశారు. బకాయిలు చెల్లించడంతో పాటు వేతనాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. నాయకులు రమణరాజు, కుంచె వసంతరావు, బాలయేసు, రాజు, సంజీవ్ దయామణి తదితరులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం ఇవ్వాలంటూ..


రహదారిపై ఆందోళన చేస్తున్న ప్రజాపంథా నాయకులు

వేలేరుపాడు, న్యూస్‌టుడే: ఇటీవల పెద్దవాగు వరదకు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలంటూ అల్లూరినగర్‌లో బుధవారం సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా నాయకులు ధర్నా చేశారు. పంట భూముల్లో ఏర్పడిన ఇసుక మేట్లను తొలగించి, ఎకరానికి రూ.50 వేలు ఇవ్వాలని డివిజన్ నాయకుడు ఎస్కే గౌస్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డ ముత్యాలరావు, సోయం చంద్రరావు పాల్గొన్నారు.

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై కె.శుభశేఖర్

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరు సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఎస్సై కె.శుభశేఖర్ తెలిపారు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో బుధవారం రాత్రి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిజిటల్ అరెస్టులు, మత్తు పదార్థాల రవాణా వ్యవహారంలో సైబర్ కేటుగాళ్లు నమ్మించి మోసం చేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆపద సమయంలో 112 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి



బాధితుడికి చెక్కు అందజేస్తున్న ముద్దరబోయిన

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వైద్య సహాయం అందజేస్తోందని తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నూజివీడు పార్టీ కార్యాలయంలో ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన జరపాల భవానీకి రూ. 98,708 చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ తాళం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో వేలం పాటలు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో పలు సేవలకు బుధవారం వేలం పాటలు నిర్వహించారు. గుడివాడ డివిజన్ ఆలయాల తనిఖీ అధికారి వి. సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేలంపాటలో పాదరక్షలు భద్రపరచుకునేందుకు ఏడాదికి రూ. 62 వేలు, రెండు దుకాణాలకు అద్దె నెలకు రూ. 8,900 చొప్పున, 'ఈ' కాంప్లెక్సులోని మూడో దుకాణానికి రూ. 8,700కు పాడుకున్నారు. కొబ్బరి చిప్పలు పోగు చేసుకునేందుకు లైసెన్సు హక్కు ధరావత్తు ఎవరూ చెల్లించకపోవడంతో దానిని వాయిదా వేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి పాల్గొన్నారు.

దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించాల్సిందే

కలిదిండి, న్యూస్‌టుడే: దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణాలను నిబంధనలు పాటించి ఏర్పాటు చేయాలని తహసీల్దారు రామకృష్ణ, ఎస్.ఐ. వెంకటేశ్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో బుధవారం దుకాణ యజమానులతో సమావేశాన్ని నిర్వహించారు. దుకాణాల మధ్య కనీసం 3 మీటర్ల దూరం ఉండేలా చూడాలని తెలిపారు. దుకాణాలను ఇనుము రేకులతో నిర్మించాలని, షాపుపై విద్యుత్తు తీగలు లేకుండా చూడాలన్నారు.

భాజపా క్రియాశీల సభ్యత్వ నమోదుపై కార్యశాల

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సింగరాయపాలెంలోని భాజపా నాయకులు మేలిమి చిట్టిబాబు నివాసం వద్ద బుధవారం ఆ పార్టీ మండలాధ్యక్షులు సత్యవోలు నాగలక్ష్మి అధ్యక్షతన క్రియాశీల సభ్యత్వ నమోదుపై కార్యశాల నిర్వహించారు. దీనిలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణ మాట్లాడుతూ మండలంలో క్రియాశీలక సభ్యుల వివరాలను జిల్లా కార్యాలయంలోని త్రిసభ్య కమిటీ సభ్యులు పరిశీలించి ఆమోదిస్తారన్నారు. మండల ప్రధాన కార్యదర్శి నీలం మల్లేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వత్తుమిల్లి ప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కార్యశాలలో పాల్గొన్న భాజపా నాయకులు

మెనూ ఇలా.. విద్యార్థులకు నచ్చేలా..!

మధ్యాహ్న భోజనంలో మార్పులు

విద్యార్థుల అభిప్రాయాల సేకరణ

చాట్రాయి, న్యూస్‌టుడే

పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన ఆహారం అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మెనూలో మార్పులు చేయడానికి విద్యా శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వంటకాల జాబితాలో కొత్తవి తీసుకు రానున్నారు. వైకాపా ప్రభుత్వ భోజన పథకాన్ని అస్తవ్యస్తంగా మార్చింది. సకాలంలో బిల్లులు చెల్లించక పోవడంతో మెనూ సక్రమంగా అమలు కాని పరిస్థితి నెలకొంది.

అమలుకు కసరత్తు..

ప్రస్తుతం పాఠశాలల్లో నూతన మెనూ అమలుకు కసరత్తు చేస్తున్నారు. అన్నం, సాంబారు, గుడ్డుతో పాటుగా కూరలు, స్వీటు, జీలకర్ర అన్నం, వేపుడు కూర రూపంలో ఇవ్వనున్నారు. సాంబారు అన్నం వడ్డించనున్నారు. రాగి జావతో పాటు కొన్ని రోజులు డ్రైఫ్రూట్స్ లడ్డూను అందించనున్నారు. ఇవన్నీ పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడిన మేరకు వచ్చిన సూచనలు అధికారులు తెలిపారు. ప్రతి విద్యార్థి పాఠశాలలోనే భోజనం చేయాలనే లక్ష్యంతో మెనూ అమలుకానుంది.



పోతనపల్లిలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు(పాత చిత్రం)

విద్యార్థులతో మాట్లాడాం..

విద్యార్థులతో మెనూ తీరుపై పాఠశాలల్లో మాట్లాడాం. చిన్నంపేట ఉన్నత పాఠశాల, చీపురుగూడెం ప్రాథమికోన్నత, పోలవరం ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 400 మంది విద్యార్థులతో మాట్లాడి.. వారు చెప్పిన అంశాలు జిల్లా అధికారులకు నివేదించాం. పులిహోరాపై అధిక శాతం మంది అయిష్టత చూపగా గుడ్డును కూర, వేపుడు తరహాలో ఇవ్వాలని విద్యార్థులు చెప్పారు.



\- వీఎస్వీ బ్రహ్మచారి, ఎంఈవో, చాట్రాయి

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: మండలంలోని సీతనపల్లి ప్రధాన రహదారి మార్గం నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకునే రోడ్డు మురుగు నీటిమయమైంది. రోగులు, స్థానికులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. **- హేమంత్, సీతనపల్లి**

సమాధానం: రోడ్డుపై ఉన్న మురుగు నీరు మళ్లించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడతాం. **- శివన్నారాయణ, పంచాయతీ కార్యదర్శి**

తపాలా కార్మికుల ఆందోళన



నినాదాలు చేస్తున్న సిబ్బంది

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : నూజివీడు పట్టణ పోస్టాఫీసు వద్ద బుధవారం ఆల్ ఇండియా గ్రామీణ బ్యాంక్ సేవక్ యూనియన్ ఆధ్వర్యంలో తపాలా కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం వల్ల దేశవ్యాప్తంగా 2.50 లక్షల మంది ఆందోళన చేస్తున్నట్లు చెప్పారు. ముందుగా మూడు గంటలు విధులు నిర్వర్తించాలని చెప్పి పది గంటల వరకు వెట్టిచాకిరీ చేయించుకోవడం దారుణమన్నారు. యూనియన్ నాయకులు వి.వి.ఎస్. అజరయ్య, జి.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

జీవాల పెంపకందారుల అభివృద్ధికి తోడ్పాటు

ముసునూరు, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని గోపవరం గ్రామ అధ్యక్షుడు బొల్లినేని బుజ్జి, లోపూడి తెదేపా నాయకుడు లక్కపాము కాంతారావు అన్నారు. ముసునూరు మండలం లోపూడిలో 1600 గొర్రెలు, 400 మేకలు, గోపవరంలో 1800 గొర్రెలు, 400 మేకలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన నట్టనివారణ మందును బుధవారం పశు వైద్యుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. పశువులకు వ్యాధులు సోకకుండా ముందుగా పశు పోషకులకు ఈ మందును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఐటీఐలో ఉద్యోగ మేళా రేపు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో గవర్నమెంట్ ఐటీఐలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వాడపల్లి కిశోర్ బుధవారం తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో నవత రోడ్డు ట్రాన్స్‌పోర్ట్, వరుణ్ మోటార్స్, మెడ్‌ప్లస్ ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 130 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. జాబ్ మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18-30 సంవత్సరాల మధ్య వయస్సు గల వారు అర్హులని తెలియజేశారు.

భాజపాలో చేరిన కైకలూరు వైకాపా ఎంపీపీ



నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కామినేని

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండల వైకాపా ఎంపీపీ అడవి వెంకట కృష్ణ మోహన్ భాజపాలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ సమక్షంలో భాజపా తీర్థం పుచ్చుకోగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మంచి వ్యక్తిగా పేరున్న అడవి కృష్ణ నిబద్ధత కలిగిన పార్టీలో లేరని పలుమార్లు చెప్పినట్లు తెలిపారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలోనే మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు దొడ్డిపట్ల గ్రామ సర్పంచి చెరుకువాడ బలరామరాజు సైతం ఎమ్మెల్యే సమక్షంలో భాజపాలో చేరారు. ఈ సందర్భంగా అడవి కృష్ణమోహన్, బలరామరాజులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై గతంలో క్రియాశీలకంగా పనిచేసిన భాజపాలో చేరినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెదేపా మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, భాజపా నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా వీరరాఘవులు పాల్గొన్నారు.

సదుపాయాలపై న్యాయమూర్తి ఆరా



వసతి గృహాన్ని పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న న్యాయమూర్తి లక్ష్మి

కైకలూరు, న్యూస్‌టుడే: వసతి గృహంలో కల్పిస్తున్న సదుపాయాలు ఎలా ఉన్నాయ్.. నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందిస్తున్నారా.. అని కైకలూరు సివిల్ కోర్టు సీనియర్ న్యాయమూర్తి వీవీఎస్‌వీ లక్ష్మి వసతి గృహంలో సౌకర్యాలపై ఆరా తీశారు. ఈమేరకు మండలంలోని కొల్లేటికోట బీసీ బాలుర వసతి గృహాన్ని న్యాయమూర్తి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతం, వంట గది, తాగునీరు, భోజనం, మరుగు దొడ్ల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా ఇంటి తరహా సదుపాయాలను అందుబాటులో ఉంచాలని వార్డెన్‌కు సూచించారు. ఈ క్రమంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాలల చట్టాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

నూజివీడు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ హెచ్చరించారు. నూజివీడులోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం మేట్‌లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల ద్వారా ఉపాధి హామీ జాబ్ కార్డులు లభిస్తాయని, నిర్దేశించిన పనులు సకాలంలో పూర్తి చేయాలని, అక్రమాలు లేకుండా ఉపాధి హామీ పనులు గ్రామాల్లో కొనసాగేలా చూస్తామన్నారు. ఉపాధి హామీ కార్మికులకు సకాలంలో నగదు జమయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో సోమేశ్వరీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు పాల్గొన్నారు.

వ్యాసరచనలో విద్యార్థుల సత్తా

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే : 'ఈనాడు' ప్రతిభా పాటవ వ్యాస రచన పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారు. బుధవారం నూజివీడు సెయింట్ ఆన్స్ ఆంగ్ల మాధ్యమ ఉన్నత పాఠశాలలో "అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సామాజిక మాధ్యమాల ప్రభావం" అనే అంశంపై బుధవారం వ్యాస రచన పోటీ నిర్వహించారు. ఉపాధ్యాయులు కొణతం విజయబాబు యాదవ్, ఎస్.తరుణ్ ఈ పోటీలను పర్యవేక్షించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా పి.రాంప్రసాద్, స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ లిల్లీ ట్రీజా వ్యవహరించారు. ఈ పోటీలో మొత్తం 113 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో బాలికలు 87 మంది, బాలురు 26 మంది ఉన్నారు. ఈ పోటీలో ప్రథమ బహుమతి పదో తరగతి విద్యార్థి ఎం.అభిలాష్, ద్వితీయ బహుమతి జి.రాధిక, తృతీయ బహుమతి తొమ్మిదో తరగతి విద్యార్థిని ఎన్.మోనిశ్రీలకు ప్రిన్సిపల్ లిల్లీ ట్రీజా బహుమతులు అందజేశారు.



పోటీలో పాల్గొన్న బాలబాలికలు



బహుమతులు అందుకున్న విద్యార్థులు


క్రీడల్లో ప్రతిభ చాటాలి



పోటీలను ప్రారంభిస్తున్న ఎస్సై రాంబాబు, అధ్యాపకులు

కైకలూరు, న్యూస్‌టుడే: లింగ భేదం లేకుండా విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని కైకలూరు గ్రామీణ ఎస్సై రాంబాబు అన్నారు. స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం కృష్ణా యూనివర్సిటీ ఆధ్వర్యంలో యువతీ యువకులకు నిర్వహిస్తున్న ఫెన్సింగ్(కత్తి సాము) పోటీలను రాష్ట్ర ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి కృష్ణ మోహన్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ ఎంతో ప్రాచీన క్రీడపై నేటితరం యువతీ యువకులు మక్కువ చూపడం అభినందనీయమన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, పట్టుదలతో సాధన చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఇక్కడ నిర్వహిస్తున్న పోటీల్లో ఉత్తమ ప్రదర్శనతో ఎంపికైన క్రీడాకారులు నవంబరు 6న జమ్మూ కశ్మీర్‌లో నిర్వహించే ఆల్ ఇండియా పోటీల్లో పాల్గొంటారని కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.శివనాగరాజు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక.. ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సీహెచ్ యామిని, వ్యాయామ ఉపాధ్యాయురాలు జి.నాగమల్లీశ్వరి బుధవారం తెలిపారు. ఈ నెల 22న జగ్గయ్యపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయిలో పోటీల్లో అండర్-17 విభాగంలో కె.సాయి సింధు, బి.సుభాషిణి, పి.జ్యోతి, పూజిత, అండర్-14 విభాగంలో ఎస్.స్నేహలత జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 27న అన్నమయ్య జిల్లా, రాయచోటిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.




ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

కబడ్డీ, ఖోఖో పోటీలలో విద్యార్థుల సత్తా..కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండి మండలం కొరుకొల్లు, కలిదిండి జడ్పీ ఉన్నత పాఠశాలల్లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలలో ఆరు తెగలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు హెచ్.ఎం. ఏసురాజు తెలిపారు. కబడ్డీలో కె.సంతోష్, రవితేజ, ఉదయ్ దినేశ్, ఫ్రాంక్లిన్, జాన్సన్, కల్యాణిలు, ఖోఖోలో నాగలక్ష్మీ దుర్గ, శిరీష, సంధ్య, చైతన్య, కిశోర్‌లు ప్రతిభను చూపి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు వివరించారు.. వీరిని పీడీ వెంకటేశ్వరరావును ఉపాధ్యాయులు అభినందించారు.



జిల్లా స్థాయిలో ఎంపికైన బాలికల కబడ్డీ జట్టు

తాళం వేయని ప్రభుత్వ కార్యాలయం పోలీసు స్టేషన్ మాత్రమే



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

మండవల్లి, న్యూస్‌టుడే: పోలీసుల అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తించాలని ఎస్.ఐ. రామచంద్రరావు పేర్కొన్నారు. పోలీసుల అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకుని మండవల్లి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాళం వేయని ఒకే ఒక్క ప్రభుత్వ కార్యాలయం పోలీసు స్టేషన్ అని తెలిపారు. వారంలో ఏడు రోజులు, రోజులో 24 గంటల ప్రజల రక్షణ కోసం పోలీసులు పనిచేస్తున్నారని తెలిపారు. వ్యాసరచన పోటీలను నిర్వహించి, చట్టాలను విద్యార్థులకు వివరించారు. ఇందులో ప్రిన్సిపల్ రవితేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

త్వరలో చింతపాడు రక్షిత పథకం నుంచి నీరు

మండవల్లి, న్యూస్‌టుడే: కొల్లేరు లంక గ్రామాలకు తాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసిన చింతపాడు రక్షిత మంచినీటి పథకం ద్వారా త్వరలో నీటిని విడుదల చేస్తామని రాష్ట్ర వడ్డి సాధికార కమిటీ అధ్యక్షుడు బలే ఏసురాజు తెలిపారు. గ్రామంలోని రక్షిత పథకం పనులు బుధవారం నాయకులతో కలిసి పరిశీలించారు. 2016లో ప్రస్తుత ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో 40 ఎకరాల చెరువును ఏర్పాటు చేయడంతోపాటు సుమారు రూ.60 లక్షల విలువైన రక్షిత మంచినీటి పథకాన్ని మంజూరు చేయించారని చెప్పారు. ప్రస్తుతం పనులు పూర్తవ్వడంతో త్వరలో ఎమ్మెల్యే కామినేని చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించి నాలుగు గ్రామాల తాగునీటి కష్టాలను తీర్చుతామన్నారు. ఇందులో నాయకులు జయమంగళ వీర్రాజు, ముంగర కొండలు, మహావిష్ణు, సైదు ఆనంద్‌బాబు, సుబ్బరాజు పాల్గొన్నారు..

రైతుల సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



బలివేలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ముసునూరు, న్యూస్‌టుడే: గ్రామాల్లో రైతుల సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దార్ శర్మ అన్నారు. బుధవారం ముసునూరు మండలం బలివేలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో గత రీ సర్వేలో దొర్లిన పొరపాట్లను సరి చేసుకోవాలని సూచించారు. వివిధ సమస్యలపై 13 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు.

భూముల విభజన ఉచితం.. చాట్రాయి, న్యూస్‌టుడే: ఉమ్మడి కుటుంబాలు, ఇతరత్రా వ్యక్తులు తమ భూములను సబ్ డివిజన్ చేసుకోవాలంటే రీ సర్వే గ్రామ సభల్లో దరఖాస్తు చేస్తే వారికి ఉచితంగా చేస్తామని జిల్లా సర్వేయర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. కొత్తగూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గతంలో సబ్ డివిజన్ చేయాలంటే రైతులు చలానాగా నగదు చెల్లించాల్సి ఉండేదన్నారు. రీ సర్వే సభలో రైతులకు ప్రభుత్వం ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉప తహసీల్దారు గీత, సర్పంచి చళ్లగుళ్ల వెంకటేశ్వరరావు, మండల ఉపాధ్యక్షుడు చళ్లగుళ్ల జగన్మోహనరావు, రాజరత్నం, విజయశేఖర్, ములగలపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

59 అర్జీల స్వీకరణ.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: భూముల రీ సర్వేలో ఉత్పన్నమైన సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు జె.సుభానీ తెలిపారు. మండలంలోని ములకలపల్లి, అల్లూరు, ఈడేపల్లిలో బుధవారం భూ రీసర్వే గ్రామసభలు నిర్వహించారు. లోపాలను సవరించుకోవడానికి ఇది మంచి అవకాశమన్నారు. మూడు గ్రామాల పరిధిలో 59 అర్జీలను రైతులు అందించారు.

రీ సర్వేలో తప్పులను సరి చేసుకోండి.. ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గత రీ సర్వేలో జరిగిన తప్పులు సరిచేసుకోవడానికి ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శాశ్వత పరిష్కారం పొందాలని తహసీల్దారు పీవీఎస్ ప్రసాద్ సూచించారు. ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



భూసార పరీక్షా ఫలితాలు అందిస్తున్న అధికారులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పంట యాజమాన్య పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ తెలిపారు. పెదపాలపర్రులో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువుల వినియోగం పెంచి అధిక పంట దిగుబడులు సాధించాలన్నారు. అనంతరం రైతులకు భూసార పరీక్షా ఫలితాలు పంపిణీ చేశారు. పశువైద్యాధికారి క్రాంతికుమార్, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టర్ హేమంత్,

అపరాల సాగుపై దృష్టి అవసరం.. మండవల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ రంగంలోని పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ వెంకటమణి పేర్కొన్నారు. మండవల్లి మండలం పెరికెగూడెం, అయ్యవారి రుద్రవరం గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాబోయే రబీలో రైతులంతా అపరాల సాగుపై దృష్టి సారించాలని కోరారు. త్వరలో అన్ని వ్యవసాయ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని అమ్ముకోవచ్చని తెలిపారు. అనంతరం మినుము మినీ కిట్లను పంపిణీ చేశారు. ఇందులో ఏవో జరీన, పెరికెగూడెం సర్పంచి పద్మ, నాయకులు ఎలికే రాంబాబు, వెంకన్న, గోపాల్, చాప్లిన్ పాల్గొన్నారు..

కాంప్లెక్స్ ఎరువుల వినియోగం తగ్గిస్తే మేలు..

చాట్రాయి, న్యూస్‌టుడే: పెట్టుబడులను తగ్గించేలా రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి అధిక ఆదాయాన్ని పొందేలా చూడాలని వ్యవసాయాధికారి బండారు శివశంకర్ తెలిపారు. మర్లపాలెంలో బుధవారం ఆయన 'పొలం పిలుస్తోంది'లో క్షేత్రస్థాయిలో రైతులతో కలసి వరి పైరును పరిశీలించి సస్య రక్షణలో సూచనలు అందించారు. ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ ఎరువుల వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించి, పురుగు మందులను తగు మోతాదులోనే వాడాలని తెలిపారు. చీడ పీడలను నివారించాలనే ఆలోచనతో క్రిమి సంహారక మందులను విచ్చలవిడిగా అవసరానికి మించి వినియోగం చేస్తున్నారని తెలిపారు. ఫలితంగా పెట్టుబడులు పెరిగి లాభాలపై ప్రభావాన్ని చూపుతాయని శివశంకర్ తెలిపారు. తెదేపా నాయకులు వెల్ది రాజారావు రైతులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన



ప్రచారం చేస్తున్న తెదేపా నాయకులు

ముసునూరు, న్యూస్‌టుడే: రానున్న పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి అర్హులైన పట్టభద్రుల ఓటు నమోదు చేయించేందుకు కూటమి నాయకులు కృషి చేయాలని గ్రామ అధ్యక్షుడు బొల్లినేని బుజ్జి అన్నారు. బుధవారం ముసునూరు మండలం గోపవరంలో తెదేపా నాయకులతో కలిసి పట్టభద్రుల ఓటు నమోదుపై ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఫారం-18లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం బలపరచిన అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేలా పనిచేయాలని పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి

కైకలూరు, న్యూస్‌టుడే: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలోనే జరగనున్న తరుణంలో అర్హత కలిగిన ఓటర్లను గుర్తించి ఓటు నమోదు చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర అన్నారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల నమోదు ప్రక్రియలోని విధివిధానాలపై అవగాహన కల్పించారు. మరికొన్ని రోజుల్లో మండల వ్యాప్తంగా ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని వాటికి సంబంధించి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు. అనంతరం బదిలీలపై వచ్చి బాధ్యతలు స్వీకరించిన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కైకలూరు గ్రామ సచివాలయం-4ను సందర్శించి శాఖాపరమైన దస్త్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ వి.కొండలరావు పాల్గొన్నారు.

బీఐఎస్ కార్యకలాపాలపై కార్యశాల



సమావేశమైన బీఐఎస్ డైరెక్టర్ శ్రీకాంత్, ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్ర

నూజివీడు, న్యూస్‌టుడే: నూజివీడు ట్రిపుల్ ఐటీలో బుధవారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బి.ఐ.ఎస్) కార్యకలాపాలపై సమాచారాత్మక కార్యశాలను నిర్వహించారు. ఈ-బీఐఎస్ ప్లాట్‌ఫారమ్, అకడమిక్ డాష్ బోర్డ్, పరిశోధన సహకారాలపై ప్రధానంగా చర్చించారు. దాంతో బీఐఎస్ కార్యక్రమాలపై అవగాహనతో పాటు ఎంవోయూ ద్వారా అధ్యాపకులు, విద్యార్థులకు పరిశోధన అవకాశాలను కల్పించే లక్ష్యాలను పెట్టుకున్నారు. ఈ సందర్భంగా బీఐఎస్ హైదరాబాద్ శాస్త్రవేత్త, డైరెక్టర్ పీవీ శ్రీకాంత్ మాట్లాడుతూ... ప్రామాణీకరణ ప్రకియ, పాఠ్యాంశాల్లో ప్రామాణీకరణను చేర్చడం, పరిశోధన ప్రాజెక్టుల్లో ఎంవోయూ సంస్థల పాత్రపై వివరించారు. ట్రిపుల్ ఐటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఎస్.అమరేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా భవిష్యత్తు పరిశోధన, విద్యా భాగస్వామ్యాలకు మార్గం సుగమమైందని అన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్యను ప్రోత్సహించడానికి, పరిశ్రమ-విద్య మధ్య సంబంధాలు పెంపొందించడానికి తోడ్పడతాయని అన్నారు.

మెప్మాతో ఆర్జీయూకేటీ ఒప్పందం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ఆర్జీయూకేటీ యాజమాన్యం నూజివీడు మెప్మాతో బుధవారం పేదరిక నిర్మూలనపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆర్జీయూకేటీ ఇన్‌ఛార్జి డైరెక్టర్ ఆచార్య ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు ఇరు వర్గాలు ఒప్పందం పత్రంపై సంతకాలు చేశారు. పట్టణ సమాఖ్య గ్రూప్ ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో ఫుడ్ కోర్టు, ఇతర దుకాణాలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు, సిబ్బందికి అందుబాటులో ఉన్న సౌకర్యాలను మెరుగుపరిచే పనిని త్వరలో ప్రారంభిస్తుందని అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిపాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు, మెప్మా ప్రతినిధులు కె.ఉదయశ్రీ, ఎం.లక్ష్మీ. జి.అఖిల విద్యార్థులు పాల్గొన్నారు.



పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

కొల్లేరులో మత్స్యకారుడు గల్లంతు



అంతర్వేది (పాతచిత్రం)

కైకలూరు, న్యూస్‌టుడే: కొల్లేరులో సంప్రదాయ వేటకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతైన సంఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పందిరిపల్లెగూడెం గ్రామానికి చెందిన ఘంటసాల అంతర్వేది (38) కొల్లేరులో సంప్రదాయ వేట సాగిస్తూ కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో బుధవారం పందిరిపల్లెగూడెం సమీపంలో పడవలో వేటకు వెళ్లిన తరుణంలో కొల్లేరు ఉద్ధృతి అధికంగా ఉండటంతో పడవ బోల్తా కొట్టింది. ఈ ఘటనలో అంతర్వేది గల్లంతవగా అతని కోసం స్థానిక మత్స్యకారులతో గాలించినా ఆచూకీ లభ్యం కాలేదని గ్రామ పెద్దలు తెలిపారు. అంతర్వేదికి భార్య, కుమారుడు ఉన్నారు. దీనిపై బుధవారం రాత్రి వరకు పోలీస్‌స్టేషన్లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

చాట్రాయిలో ఆకతాయిలకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్.ఐ. రామకృష్ణ

చాట్రాయి, న్యూస్‌టుడే: విద్యా సంస్థల వద్ద అల్లరిగా ప్రవర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తే వారి భవిష్యత్తుకు ఆటంకాలు తప్పవని ఎస్.ఐ. డి.రామకృష్ణ తెలిపారు. చాట్రాయి స్టేషన్‌లో పాఠశాలలు, కళాశాల వద్ద ఆకతాయి చేష్టలకు పాల్పడుతున్న యువకులకు వారి తల్లిదండ్రుల సమక్షంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టపరమైన చర్యలు తీసుకుంటే వచ్చే నష్టాలను వారికి వివరించారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మంచి ప్రవర్తనతో ఉండాలని తెలిపారు.